ప్రతి అక్షరం ప్రజాహితం

RNI No: APTEL -2023/89112 www.andhrapragathi.com

నేటి ఆంధ్రప్రగతి

తెలుగు దినపత్రిక

సంపుటి - 02 సంచిక -148 పేజీలు - 08 వెల - 04/- మంగళవారం 18 మార్చి 2025

# రాష్ట్రం యూనిట్ గా ఎస్సీ వర్గీకరణ

## సీఎం చంద్రబాబు అధ్యక్షతన ఏపీ కేబినెట్ సమావేశం





**వైఎస్సార్ జిల్లా ఇక వైఎస్సార్ కడప**

**ప్రైవేట్ వర్సిటీ బిల్లుకు ఆమోదం...**


**కేబినేట్ అనంతరం**

**బాబుతో పవన్ కళ్యాణ్ భేటీ**

**అమరావతి,మార్చి 17ఆంధ్ర ప్రగతి :** :వైఎస్ఆర్ జిల్లా పేరు మార్పుపై చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. ఇకపై వైఎస్ఆర్ కడపగా జిల్లా పేరు మార్చాలని నిర్ణయించింది. సోమవారం అమరావతిలో సీఎం చంద్రబాబు అధ్యక్షతన కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో వైఎస్ఆర్ జిల్లాకు కడప పేరు కలుపుతూ కెబినెట్ నిర్ణయం తీసుకుంది. దీంతో ఇకపై వైఎస్ఆర్ జిల్లాను వైఎస్ఆర్ కడప జిల్లాగా పరిగణించనున్నారు. గతంలో వైఎస్ఆర్ కడప జిల్లా పేరు ఉండేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం జిల్లా పేరులోని కడప తొలగించింది. దీంతో నాటి నుంచి వైఎస్ఆర్ జిల్లాగా వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర సచివాలయంలో కేబినెట్ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. ప్రధానంగా ఎస్సీ వర్గీకరణ బిల్లుపై మంత్రులతో సీఎం చంద్రబాబు మాట్లాడారు.

# ఉగ్రవాదంపై ఉమ్మడి పోరు

## భారత్-న్యూజిలాండ్ నిర్ణయం




**న్యూఢిల్లీ,మార్చి 17ఆంధ్ర ప్రగతి :** ఉగ్రవాదాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ సహించేది లేదని, ఉగ్రవాదంపై సమష్టి పోరాటానికి భారత్-న్యూజిలాండ్ నిర్ణయించాయని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ తెలిపారు. ఉభయదేశాల మధ్య ద్వైపాక్షిక సంబంధాలను మరింత మెరుగుపరచుకోవడం, అంతర్జాతీయ సవాళ్లను కలిసికట్టు-గా ఎదుర్కోవాలని నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. న్యూజిలాండ్ ప్రధాని క్రిష్టోపర్ లక్సన్ తో భేటీ- అనంతరం ఉభయులూ సంయుక్తంగా మీడియా సమావేశంలో పాల్గొన్నారు. న్యూజిలాండ్ ప్రధాన లక్సన్ మాట్లాడుతూ, భారతదేశంతో పటిష్ట సంబంధాలకు తాము కట్టు-బడి ఉన్నామని అన్నారు. ఇరుదేశాల మధ్య వారధిగా న్యూజిలాండ్‌లోని ఎన్ఆర్ఐలు నిలుస్తున్నారని ప్రశంసించారు. న్యూఢిల్లీకి తనను ఆహ్వానించిన ప్రధాని నరేంద్ర మోదీకి కృతజ్ఞతలు తెలిపారు. కాగా, లక్సన్ పర్యటన సందర్భంగా రక్షణ రంగంలో రెండు దేశాల మధ్య సహకరాన్ని కొనసాగించే ఒక ఒప్పందంపై ఇరుదేశాలు సంతకాలు చేశాయి.

# స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందించాం

**ఎపి సమగ్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్**

**2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ**

**అసెంబ్లీలో విజన్ డాక్యుమెంట్ చర్చపై చంద్రబాబు**



2లో

# వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో రూ. 250 కోట్ల అవినీతి

**డిప్యూటీ సీఎంపవన్ కల్యాణ్**


**ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో ప్రశ్నోత్తరాలు మాట్లాడిన డిప్యూటీ సీఎం**

**మొత్తం రూ.250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందన్న పవన్**



**అమరావతి,మార్చి 17ఆంధ్ర ప్రగతి :** ఏపీ ఉపాధి హామీ పథకంలో గత వైసీపీ ప్రభుత్వ హయాంలో భారీగా అవినీతి జరిగిందని డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ అసెంబ్లీలో ఆరోపించారు. ఉపాధి హామీ నిధుల దుర్వినియోగంపై అసెంబ్లీలో జరిగిన ప్రశ్నోత్తరాల సమయంలో ఆయన మాట్లాడారు. మొత్తం రూ. 250 కోట్ల అవినీతి జరిగినట్లు అధికారులు ఇచ్చిన నివేదికల ద్వారా వెల్లడైందని పవన్ పేర్కొన్నారు.ప్రభుత్వం ఇప్పటివరకు 564 మండలాల్లో ఉపాధి హామీ పనులపై సోషల్ ఆడిట్ నిర్వహించిందని తెలిపారు. ఈ పరిశీలనలో అనేక అవకతవకలు బయటపడ్డాయని, ఉపాధి హామీ కింద ఖర్చు చేసిన నిధులపై అనుమానాస్పద లావాదేవీలు జరిగినట్లు గుర్తించామన్నారు. మిగతాది 2లో...

# తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం



**మార్చి 24 నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు**

**సోమ, మంగళవారాల్లో తెలంగాణ సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం**

**బుధ, గురువారాల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం**

2లో

# ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కచ్చితంగా చెల్లిస్తాం

**: మంత్రి నారా లోకేశ్**

**విద్యారంగంపై చర్చ కావాలని అడిగి.. వైసీపీనే పాల్గొనలేదన్న మంత్రి**



**అమరావతి,మార్చి 17ఆంధ్ర ప్రగతి :** ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలపై వాస్తవాలను వినే పరిస్థితిలో వైసీపీ లేదని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ దుయ్యబట్టారు. ఫీజు రీయింబర్స్ మెంట్ ద్వారా పేద విద్యార్థులకు ఆర్థికసాయంపై మండలిలో వైసీపీ సభ్యుల ప్రశ్నలకు సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి సమాధానం ఇచ్చారు. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిల విషయంలో వైసీపీ అవాస్తవాలు ప్రచారం చేస్తుందంటూ మంత్రి లోకేశ్ కలగచేసుకుని మిగతాది 2లో...

# ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

**ప్రధాని అపాయింట్‌మెంట్ కోరుతూ లేఖ**

**అఖిలపక్షంతో వచ్చి కలుస్తామని పేర్కొన్న ముఖ్యమంత్రి**

**బీసీ రిజర్వేషన్ బిల్లుకు కేంద్రం మద్దతు కావాలన్న ముఖ్యమంత్రి**



**మార్చి 17ఆంధ్ర ప్రగతి :** ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ రాశారు. ప్రధాని అపాయింట్‌మెంట్ కోరుతూ ఆయన లేఖ రాశారు. అఖిలపక్ష సమావేశానికి సమయమివ్వాలని కోరారు. రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్, బీజేపీ, మజ్లిస్, సీపీఐ పార్టీలతో కూడిన ప్రతినిధులతో వచ్చి కలుస్తామని, అందుకు సమయం ఇవ్వాలని ఆ లేఖలో పేర్కొన్నారు. మిగతాది 2లో...

# టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య కేసులో ఇద్దరు అరెస్ట్



**వివరాలు వెల్లడించిన చిత్తూరు ఎస్పీ**

**పోలీసులు అదుపులో ప్రధాన నిందితుడు వెంకటరమణ, రెడ్డప్పరెడ్డి**

**మాజీ మంత్రి అనుచరుడిగా రెడ్డప్పరెడ్డి గుర్తింపు**

**వైసీపీ నేతలతో నిందితుడి ఫోన్ సంభాషణలు!**

**భూ ఆక్రమణలపై పోరాటమే హత్యకు కారణం కావొచ్చన్న పోలీసులు**

2లో

# రాష్ట్రం యూనిట్ గా ఎస్సీ వర్గీకరణ

(మొదటి పేజీ తరువాయి)

మంత్రులతో మాట్లాడిన అనంతరం ఎస్సీ వర్గీకరణ బిల్లుపై కీలక నిర్ణయం తీసుకున్నారు. ఈ బిల్లుకు కేబినెట్ ఆమోదం తెలిపింది. రాజీవ్ రంజన్ మిశ్రా ఇచ్చిన నివేదిక, దానిపై మంత్రుల కమిటీ ఇచ్చిన నివేదికపై కేబినెట్ చర్చించింది. రాష్ట్రం యూనిట్‌గా రిజర్వేషన్ అమలు చేయాలని నిర్ణయం తీసుకుంది. జిల్లా యూనిట్‌గా చేయాలని కొంతమంది మంత్రులు కోరారు. అలా చేస్తే న్యాయ పరమైన చిక్కులు వస్తాయని అధికారులు తెలిపారు. ప్రస్తుతానికి నివేదికను యధాతధంగా ఆమోదిద్దామని సీఎం చంద్రబాబు పేర్కొన్నారు. ఏపీ కేబినెట్ సమావేశంలో ఆంధ్రప్రదేశ్ ప్రైవేట్ యునివర్సిటీస్ యాక్ట్- 2016 సవరణ బిల్లుకు ఆమోదం తెలిపింది.. వాసిరెడ్డి వెంకటాద్రి ఇంటర్నేషనల్ -టెక్నాలజికల్ యూనివర్సిటీ నంబూరు, పెద్ద కాకానికి బ్రౌన్ ఫీల్డ్ క్యాటగిరి కింద అనుమతిస్తూ కేబినెట్ నిర్ణయం తీసుకుంది.. ఆంధ్రప్రదేశ్ స్టేట్ టీచర్స్ ట్రాన్స్‌ఫర్స్, రెగ్యులేషన్ యాక్ట్- 2025 డ్రాఫ్ట్ బిల్లును అప్రూవ్



చేసింది.. ప్రభుత్వ జిల్లా పరిషత్, మండల పరిషత్ మున్సిపల్ స్కూళ్లకు ఇది వర్తింప జేయనున్నారు.. ఇక, సీఆర్డీఏ పరిధిలో మంత్రివర్గ ఉపసంఘం సిఫారసు మేరకు భూములు కేటాయింపునకు కేబినెట్ ఆమోదముద్ర వేసింది.. అమరావతిలోని సీఆర్డీఏ పరిధిలో ఎన్- 10 నుంచి ఎన్ 13 వరకు... ఈ1 జంక్షన్ నుండి సీఆర్డీఏ సరిహద్దుల వరకు 1082 కోట్ల రూపాయలతో 400కెవి డిసి లైన్ ఏర్పాటు-కు కూడా కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది.. మరోవైపు.. బుడమేరు డివిజన్ కు సంబంధించి మెకానికల్, ఎలక్ట్రికల్ యంత్రాల రిపేర్లకు పరిపాలన అనుమతి జారీకి కేబినెట్ ఆమోదం తెలిపింది.. ఏపీలో స్టార్ట్ అప్ ఇన్నోవేషన్ ఎకో సిస్టం ఏర్పాటు-కు నిర్ణయం తీసుకున్నారు.. ఈ మేరకు ఆంధ్రప్రదేశ్ ఇన్నోవేషన్ స్టార్టప్ పాలసీ 4.0కు ఏపీ కేబినెట్ ఆమోద ముద్ర వేసింది.. ప్రభుత్వ హామీ మేరకు చేనేత కార్మికులకు 200 యూనిట్లు-, పవర్లూమ్‌లకు 500 యూనిట్లు వరకు ఉచిత విద్యుత్తు ఇచ్చే అంశంపై కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్న విషయం విదితమే..


కేబినెట్ సమావేశం ముగిసిన తర్వాత సీఎం చంద్రబాబు ఛాంబర్ కి వెళ్లి డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్.. ఆయనతో ప్రత్యేకంగా భేటీ- అయ్యారు.. తాజా రాజకీయ పరిణామాలపై సీఎం, డిప్యూటీ సీఎం మధ్య చర్చకు వచ్చినట్టు-గా తెలుస్తుండగా.. ఎమ్మెల్యే కోటాలో ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన నాగబాబును మంత్రివర్గంలోకి తీసుకునే అంశంపై కూడా చర్చ జరిగినట్లు సమాచారం.. మరోవైపు ఢిల్లీ పర్యటనకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సిద్ధం అయ్యారు.. ఢిల్లీ టూర్‌లో ప్రధాని నరేంద్ర మోడీని కలవనున్న ఆయన.. రాజధాని అమరావతి పునఃనిర్మాణ పనులు ప్రారంభించడానికి ప్రధానిని ఆహ్వానించడంపై కూడా చర్చ జరిగినట్లు- తెలుస్తోంది.

# స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందించాం

**ఎపి సమగ్రాభివృద్ధికి విజన్ డాక్యుమెంట్**

**2047 నాటికి 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీ**

**అసెంబ్లీలో విజన్ డాక్యుమెంట్ చర్చపై చంద్రబాబు**



అమరావతి,**మార్చి 17ఆంధ్ర ప్రగతి :**
గత వైసీపీ పాలన కారణంగా ధ్వంసమైన రాష్ట్రాన్ని మళ్లీ ట్రాక్‌లో పెట్టగలిగామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. అయితే రాష్ట్ర భవిష్యత్తు కోసం దూరదృష్టితో ఆలోచించి ప్రణాళికలు రూపొందించుకోవాల్సి ఉందని ఆయన పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీలో విజన్ డాక్యుమెంట్ 2047పై లఘు చర్చ జరిగింది. ఈ సందర్భంగా సీఎం చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ.. 2047 నాటికి ఆంధ్రప్రదేశ్ 2.4 ట్రిలియన్ డాలర్ల ఎకానమీగా మార్చడమే తమ ప్రభుత్వ లక్ష్యమన్నారు. అలాగే రూ. 308 లక్షల కోట్ల రాష్ట్ర స్థూల ఉత్పత్తి సాధించేలా ప్రణాళికలు తయారు చేశామన్నారు. 1990లలో సమైక్య ఆంధ్రప్రదేశ్ కోసం విజన్ 2020 తీసుకు వచ్చామని గుర్తు చేశారు. తద్వారా నాడు చెప్పిన దాని కంటే ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు అధిక ప్రయోజనమే కలిగిందని తెలిపారు.అయితే 2047 వికసిత్ భారత్‌ను ప్రధాని నరేంద్ర మోదీ అమలు చేస్తున్నారన్నారు. అందులో భాగంగానే ఆంధ్రప్రదేశ్‌ని కూడా అభివృద్ధి దిశగా అడుగులు వేసేందుకు స్వర్ణాంధ్ర విజన్ 2047 డాక్యుమెంట్‌ను రూపొందించామని చెప్పారు. అందులో ఎమ్మెల్యేలను సైతం భాగస్వాములుగా చేస్తూ నియోజకవర్గ విజన్ డాక్యుమెంట్‌ను రూపొందించామని వివరించారు.ఇక ప్రతి ఏటా రూ. 15 శాతం వృద్ధి రేటు-తో రూ. 55 లక్షల తలసరి ఆదాయం సాధించేలా విజన్ డాక్యుమెంట్ రూపొందించామని వివరించారు.ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 17.11 శాతం మేర వృద్ధి రేటు- సాధించేలా లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మొత్తంగా జీఎస్టీపీ రూ. 18,65,704 కోట్ల మేర.. తలసరి ఆదాయం రూ. 3.47 లక్షల లక్ష్యంగా పని చేస్తున్నామని చెప్పారు. 2014-19 కన్నా 1.5 శాతం అదనంగా పెరుగుదల ఉండాలని సీఎం చంద్రబాబు ఆకాంక్షించారు. ఏప్రిల్ 1వ తేదీ నుంచి కొత్త ఆర్థిక సంవత్సరం ప్రారంభం కానుందని సీఎం చంద్రబాబు గుర్తు చేశారు. అసెంబ్లీ ఎన్నికల వేళ.. మూడు పార్టీలు రాష్ట్రాన్ని పునర్నిర్మాణం చేస్తామని హామీ ఇచ్చాయని గుర్తు చేశాయి. దీంతో 93 శాతం అనుకూల ఫలితాలు వచ్చాయని సీఎం చంద్రబాబు వివరించారు. ఈ సందర్భంగా సిఎం చంద్రబాబు మాట్లాడుతూ ... గతంలో తన ఓటమికి ఎవరూ బాధ్యులు కాదని, తన ఓటమికి తానే కారణం అని ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. 2004, 2019 లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో టీడీపీ ఓటమికి కారణం తానేనని, తనను ఎవరూ ఓడించలేదని అన్నారు. తాను కొన్ని పనులు చేయకపోవడం వల్లే అపుడు ఓటమి చెందామని తెలిపారు. ప్రజల కోసం పని చేస్తూ.. పార్టీని, ఎమ్మెల్యేలను సమన్వయం చేయలేక పోయాయని, ఆ పొరపాటు నుంచి ఎంతో నేర్చుకొని మళ్ళీ విజయం సాధించాం అని వెల్లడించారు. ప్రజాసమస్యలకు శాశ్వత పరిష్కారం చూపితేనే ప్రజలు వెంట ఉంటారని, లేదంటే ప్రజలు మనలను పక్కన పెట్టేస్తారని అన్నారు. మరోసారి టీడీపీకి అలాంటి పరిస్థితి తీసుకురాబోనని చంద్రబాబు అసెంబ్లీలో ఉద్ఘాటించారు. ఇక రానున్న ఉగాది నుంచి ఎపిలోని ప్రతి నియోజకవర్గంలో పీ 4 విధానం అమలు చేస్తామని ప్రకటించారు. పేదలకు చేయూత ఇవ్వడానికి వీలుగా జాబితా సిద్ధం చేస్తామన్నారు. 2029లో ప్రజలకు ఏం చేస్తామో ముందే చెప్పి ఎన్నికలకు వెళదామని కూటమి సభ్యులకు సిఎం సూచించారు.

## పారదర్శకంగా మైనింగ్ కార్యకలాపాలు


### కలెక్టర్ లక్ష్మీశ వెల్లడి



విజయవాడ, **మార్చి 17ఆంధ్ర ప్రగతి :**
జిల్లాలో అత్యంత పారదర్శకంగా నిబంధనలకు అనుగుణంగా మైనింగ్ కార్యకలాపాలు జరిగేలా పటిష్ట పర్యవేక్షణతో నిరంతర అప్రమత్తతతో వ్యవహరిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఇసుక లేదా మట్టి రవాణాకు సంబంధించి వచ్చే ఆరోపణలపై సమగ్ర విచారణ జరిపి నివేదికల సమర్పణకు ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. జి.కొండూరు మండలం, కోడూరు గ్రామ కొత్త చెరువుతో పాటు- నందిగామ మండలం, చిన నందిగామ వద్ద డంప్ నుంచి ఇసుక అక్రమ రవాణా జరుగుతున్నట్లు- వచ్చిన ఆరోపణలపై ఏపీఎస్ఎస్‌సీ లిమిటెడ్ డీఎం, మైన్స్ డీడీ, విజయవాడ రూరల్ తహసీల్దార్, మైలవరం మండలం సర్వేయర్, సంబంధిత వీఆర్‌వోలతో కమిటీ- ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు. అదేవిధంగా జగ్గయ్యపేట మండలం, కొంగర మల్లయ్యగట్టు- వద్ద అక్రమ క్వారీయింగ్ ఆరోపణలపైనా కమిటీ- ఏర్పాటు- చేసినట్లు- తెలిపారు. ఏపీఎస్ఎస్‌సీ లిమి-టె-డ్ డీఎం, మైన్స్ డీడీ, విజయవాడ రూరల్ తహసీల్దార్, మైలవరం మండలం సర్వేయర్, సంబంధిత వీఆర్‌వోలతో కమిటీ- ఏర్పాటు- చేసినట్లు- వెల్లడించారు. నిర్దేశ ప్రాంతాల్లో పటిష్ట నిఘాకు కూడా ఈ కమిటీ-లు పనిచేస్తాయని వెల్లడించారు. నిబంధనలకు విరుద్ధంగా ఎవరైనా అక్రమ తవ్వకాలు లేదా రవాణాకు పాల్పడితే చట్టపరంగా కఠిన చర్యలు తప్పవని కలెక్టర్ లక్ష్మీశ హెచ్చరించారు.

## గత ప్రభుత్వం పోలీసులను విఆర్‌లో ఉంచింది

### మండలిలో మంత్రి అనిత వెల్లడి



అమరావతి,**మార్చి 17ఆంధ్ర ప్రగతి :** పెద్ద ఎత్తున పోలీసులను విఆర్ లో ఉంచిందని ఎపి హోం మంత్రి అనిత తెలిపారు. పోలీసులను విఆర్ లో ఉంచడంపై శాసన మండలిలో చర్చ జరిగింది. సభ్యుల ప్రశ్నలకు అనిత సమాధానాలు ఇచ్చారు. విఆర్ లో ఉన్న పోలీసులకు గత ప్రభుత్వం జీతం ఇవ్వలేదని విమర్శించారు. పోలీసులను విఆర్ లో ఉంచితే గతంలో 50 శాతం జీతం ఇచ్చేవారన్నారు. కక్షపూరితంగా గత ప్రభుత్వం పోలీసులను విఆర్ కు పంపిందని, కొందరు పోలీసులకు గత ప్రభుత్వం 3-4 ఏళ్లు జీతాలు ఆపిందని వెల్లడించారు. ఉద్యోగిపై విఆర్ ను ఎత్తివేయగానే పెండింగ్ వేతనం ఇస్తున్నామని, విఆర్ లో ఉన్న పోలీసులకు వేతనం ఇచ్చే అంశాన్ని పరిశీలిస్తున్నామని హోం మంత్రి అనిత పేర్కొన్నారు.

## పాముకాటుకు చికిత్స పొందుతూ పరీక్ష రాసిన విద్యార్థి

కాకినాడ,**మార్చి 17ఆంధ్ర ప్రగతి :**పాము కాటుకు గురై ఆస్పత్రిలో చికిత్స పొందుతూనే.. పదో తరగతి పరీక్ష రాశాడో విద్యార్థి. తూర్పు గోదావరి జిల్లా శ్రీకృష్ణపట్నానికి చెందిన వై.నిస్సీ.. అనపర్తి మండలం లక్ష్మీనరసాపురంలోని అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో చదువుకుంటున్నాడు. పదో తరగతి పరీక్షల నేపథ్యంలో ఓ చెట్టు- కింద కూర్చొని చదువుకుంటున్న సమయంలో రాయి కింద వేలు దూర్చగా.. ఏదో కుట్టినట్లు అనిపించిందని చెప్పాడు. రాయి పక్కకి తీసి చూడగా తాచుపాము పిల్ల కనిపించిందన్నాడు. వెంటనే తనను ఉపాధ్యాయులు అనపర్తి ప్రభుత్వ ఏరియా ఆస్పత్రికి తరలించినట్టు చెప్పాడు. సోమవారం పదో తరగతి పరీక్షలు ప్రారంభమవడంతో.. ఆస్పత్రి నుంచే వెళ్లి అతడు పరీక్ష రాశాడు.

## వైసీపీ హయాంలో ఉపాధి హామీ పనుల్లో రూ. 250 కోట్ల అవినీతి

(మొదటి పేజీ తరువాయి)

రాష్ట్ర వ్యాప్తంగా పథకం ద్వారా వచ్చిన నిధులు లబ్ధిదారులకు చేరకుండా కొందరు మధ్యవర్తుల చేతుల్లోకి వెళ్లాయని డిప్యూటీ సీఎం ఆరోపించారు.ఇప్పటికే మొదలైన ఆడిట్ ప్రక్రియను మరింత వేగవంతం చేసి ఈ నెలాఖరులోగా మిగిలిన మండలాల్లో కూడా పూర్తి చేస్తామని తెలిపారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో ఉపాధి హామీ పనులను సమీక్షించి, అవినీతికి కారణమైన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. భవిష్యత్తులో ఇలాంటి అక్రమాలు జరగకుండా పకడ్బందీ చర్యలు తీసుకుంటామని ఆయన హామీ ఇచ్చారు. ఇక ఉపాధి హామీ కూలీలకు వేతనాల పెంపు అంశం అనేది కేంద్రం పరిధిలో ఉంటుందని పవన్ వెల్లడించారు.

## తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం

(మొదటి పేజీ తరువాయి)

తెలంగాణ ప్రజాప్రతినిధులకు టీటీడీ శుభవార్త చెప్పింది. ఇకపై తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలకు కూడా శ్రీవారి దర్శనం కల్పించాలని టీటీడీ నిర్ణయించింది. మార్చి 24వ తేదీ నుంచి తెలంగాణ సిఫార్సు లేఖలకు శ్రీవారి దర్శనం కేటాయింపు ఉంటాయని టీటీడీ వెల్లడించింది. కాగా, గత ప్రభుత్వ హయాంలో తెలంగాణ ప్రజాప్రతినిధులను అప్పటి టీటీడీ పాలకులు, అధికారులు పట్టించుకోలేదన్న ఆరోపణలు ఉన్నాయి. తాజాగా సీఎం చంద్రబాబు నాయుడు ఆదేశాలు, టీటీడీ ఛైర్మన్ బీఆర్ నాయుడు ప్రత్యేక చొరవతో తెలంగాణ ప్రజాప్రతినిధుల సిఫార్సు లేఖలు స్వీకరించే విధానం అమలు కానుంది.సోమ, మంగళవారాల్లో తెలంగాణ సిఫార్సు లేఖపై వీఐపీ బ్రేక్ దర్శనం కేటాయింపు ఉంటుంది. అలాగే బుధ, గురువారాల్లో రూ. 300 ప్రత్యేక ప్రవేశ దర్శనానికి అవకాశం ఉంటుంది. ఒక ప్రజాప్రతినిధి తాలూకు ఒక సిఫార్సు లేఖపై ఆరుగురికి మించకుండా దర్శన అవకాశం కేటాయించనుంది. ఏపీ ప్రజా ప్రతినిధులకు ఇకపై సోమవారం దర్శనానికి సిఫార్సు లేఖలు స్వీకరించబడవు.

దానికి బదులుగా ఆదివారం దర్శనం కోసం శనివారం నాడు టీటీడీ లేఖలు స్వీకరించనుంది. సుదీర్ఘంగా చర్చించి, అన్ని అంశాలను పరిగణలోకి తీసుకున్న అనంతరం ఈ మేరకు నిర్ణయం తీసుకున్నట్టు టీటీడీ వెల్లడించింది. ఈ మార్పులను దృష్టిలో ఉంచుకొని సిబ్బందికి సహకరించాలని భక్తులను టీటీడీ కోరింది.

## ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కచ్చితంగా చెల్లిస్తాం

(మొదటి పేజీ తరువాయి)

వైసీపీ సభ్యుల ఆరోపణలు తిప్పికొట్టారు. మంత్రి మాట్లాడుతూ.. విద్యారంగంపై శాసనమండలిలో చర్చ జరిగితే వైసీపీ సభ్యులు ఎందుకు బయటకు వెళ్లారు? ఈ విషయాలన్నీ ఆ రోజు చెప్పాం. మీరెందుకు బాయ్ కాట్ చేశారు? ఆ రోజు జరిగిన చర్చలో ఫీజు రీయింబర్స్ మెంట్ పై చాలా స్పష్టంగా చెప్పాం. వినకుండా, చదవకుండా మళ్లీ ఇప్పుడు ఆరోపణలు చేస్తున్నారు. నోట్ పంపిస్తాను, ఒకసారి చదవాలి. మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి వాస్తవాలు చెబుతుంటే దానిని కూడా ఓర్చుకోలేక పోతున్నారు. వైసీపీ హయాంలో రూ. 4,200 కోట్లు బకాయిలు పెట్టారు. అవునో, కాదో చెప్పాలి. వివరాలు పంపిస్తాం. స్కూల్ ఫీజు రీయింబర్స్ మెంట్, పీజీ ఫీజు రీయింబర్స్ మెంట్ వివరాలన్నీ అందులో ఉన్నాయి. 2019లో ఆనాటి ప్రభుత్వం పెట్టిన బకాయిలను 16 నెలల తర్వాత వైసీపీ ప్రభుత్వం చెల్లించింది. కూటమి ప్రభుత్వం వచ్చి 10 నెలలే అయింది. ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు కచ్చితంగా చెల్లిస్తాం. హౌస్ సాక్షిగా హామీ ఇచ్చాను. చర్చలో వైసీపీ సభ్యులు లేకపోతే నేనేం చేయగలను. బీఏసీలో విద్యారంగంపై చర్చ కావాలని అడిగితే ఒప్పుకున్నాం. కానీ ఆ చర్చకు వైసీపీనే లేదు. వాస్తవాలు వినడానికి సిద్ధంగా లేరని మంత్రి విమర్శించారు. ప్రభుత్వం ఇచ్చిన వివరాలు పూర్తిగా చదవాలని సూచించారు. విద్యార్థుల జీవితాలతో వైసీపీ ప్రభుత్వం చెలగాటమాడిందని మంత్రి డోలా బాలవీరాంజనేయస్వామి ధ్వజమెత్తారు. వసతి దీవెన ఏనాడు సక్రమంగా చెల్లించలేదని ఆయన మండిపడ్డారు.

## టీడీపీ కార్యకర్త రామకృష్ణ హత్య కేసులో ఇద్దరు అరెస్ట్

చిత్తూరు **మార్చి 17ఆంధ్ర ప్రగతి :**
చిత్తూరు జిల్లాలోని పుంగనూరు మండలం కృష్ణాపురంలో తెలుగుదేశం పార్టీ కార్యకర్త రామకృష్ణ హత్య కేసులో పోలీసులు ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. చిత్తూరు ఎస్పీ తెలిపిన వివరాల ప్రకారం, ఈ కేసులో ముఖ్య నిందితుడు వెంకటరమణ, అలాగే ఐదవ నిందితుడు రెడ్డప్పరెడ్డిని అరెస్టు చేశారు. మిగిలిన ముగ్గురు నిందితుల కోసం ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఎస్పీ మీడియా సమావేశంలో మాట్లాడుతూ, ప్రత్యర్థులను భయపెట్టేందుకే రామకృష్ణను హత్య చేసినట్లు తెలిపారు. నిందితుల్లో ఒకరైన రెడ్డప్పరెడ్డి, మాజీ మంత్రి పెద్దిరెడ్డికి ముఖ్య అనుచరుడని వెల్లడించారు. హత్యకు ముందు నిందితుడు వైసీపీ ముఖ్య నేతలతో ఫోన్‌లో మాట్లాడినట్లు గుర్తించామని ఆయన పేర్కొన్నారు. నిందితులు భూ ఆక్రమణలు, బెదిరింపులకు పాల్పడినట్లు ఆధారాలు ఉన్నాయని, వారి అక్రమాలపై పోరాటం చేస్తున్నందుకే రామకృష్ణను హత్య చేసి ఉంటారని అనుమానిస్తున్నట్లు ఎస్పీ తెలిపారు. ఈ హత్య మార్చి 15న జరిగింది.

## ప్రధాని నరేంద్ర మోదీకి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి లేఖ

(మొదటి పేజీ తరువాయి)

బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లును శాసనసభ ఆమోదించిన విషయాన్ని ఈ లేఖలో ముఖ్యమంత్రి ప్రస్తావించారు. ఈ బిల్లుకు కేంద్ర ప్రభుత్వం మద్దతు కావాలని కోరారు. రాష్ట్రంలోని విద్య, ఉద్యోగాలలో, స్థానిక సంస్థల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు వీలుగా తీసుకువచ్చిన రెండు బిల్లులకు తెలంగాణ శాసనసభ సోమవారం ఆమోదం తెలిపింది.

## గ్రీన్ కార్డ్ హోల్డర్లకు వేధింపు

### ఎయిర్‌పోర్టులో నిర్బంధిస్తున్న యూఎస్ అధికారులు

వాషింగ్టన్,,,**మార్చి 17ఆంధ్ర ప్రగతి :**
డోనాల్డ్ ట్రంప్ అధ్యక్ష పగ్గాలు చేపట్టాక అమెరికాలో ఉన్న వలసదారుల కు చుక్కలు చూపిస్తున్నారు.అమెరికా ఫస్ట్ అన్న నినాదంతో అధికారంలోకి వచ్చిన ట్రంప్.. ఆ దిశగా వేగంగా అడుగులేస్తున్నారు. అక్రమ వలసదారులను యుద్ధప్రాతిపదికన తరిమేసిన ట్రంప్ ఇప్పుడు సీనియర్ గ్రీన్ కార్డ్ హోల్డర్స్ పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. అమెరికన్ ఇమ్మిగ్రేషన్ అధికారులు గ్రీన్ కార్డు హోల్డర్స్ పై గట్టి నిఘా పెట్టారు. ముఖ్యంగా ఇండియన్స్ పై ఫోకస్ పెట్టినట్లు తెలుస్తోంది. గ్రీన్ కార్డులను అయిర్ పోర్టులో సబ్మిట్ చేసి వెళ్లాలంటూ ఆంక్షలు విధిస్తున్నట్లు సమాచారం. ఎయిర్ పోర్టులో గ్రీన్ కార్డులు సబ్మిట్ చేయకపోతే రాత్రంతా ఎయిర్ పోర్టులోనే నిర్బంధిస్తున్నట్లు సమాచారం.అయితే.. గ్రీన్ కార్డు హోల్డర్స్ ని నిర్బందించే అధికారం ఎయిర్‌పోర్టు అధికారులకు లేదని.. ఈ అంశంపై కోర్టుకెళ్లే హక్కు గ్రీన్ కార్డు హోల్డర్స్ కి ఉందని.. ఇండియన్ ఎంబసీ అధికారులు అంటున్నారు. అమెరికా అధికారుల బెదిరింపులకు భయపడొద్దని.. గ్రీన్ కార్డులు ఎయిర్పోర్టులో సబ్మిట్ చేయాల్సిన అవసరం లేదని అంటున్నారు.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక
మంగళవారం 18 మార్చి 2025

# ఎన్నికల హామీలను కూటమి ప్రభుత్వం అమలు పరచాలి

**-ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు డీఎస్సీ నిర్వహించాలి.**
**-ఈఐవైఎఫ్ నంద్యాల జిల్లా కార్యదర్శిజి. నాగరాముడు డిమాండ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 17:
రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ శాఖ,పోస్టులు భర్తీకి డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని అఖిల భారత యువజన సమాఖ్య రాష్ట్ర పిలుపు లో బాగంగా నంద్యాల జిల్లాకలెక్టర్ కార్యాలయ%శీ% లోని డిఆర్ఓ రాము నాయక్ కు జిల్లా సమితి ఆధ్వర్యంలో వినతి పత్రం ఇవ్వడం జరిగింది .ఈ సందర్భంగా నంద్యాల జిల్లా ఏఐవైఎఫ్ జిల్లా కార్యదర్శి
జి. నాగరాముడు,మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఖాళీగా ఉన్న టీచింగ్ నాన్ టీచింగ్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తామని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు మొదటి సంతకం చేశారు. కానీ నోటిఫికేషన్ వెలుబడలేదు. నోటిఫికేషన్ లేక లక్షలాదిమంది నిరుద్యోగులు కోచింగ్ సెంటర్లో లక్షల్లో ఫీజులు చెల్లించి నోటిఫికేషన్ వెలువడక ఆత్మహత్యలు చేసుకుంటున్నారని, అదేవిధంగా అనంతపురం, కర్నూలు, కడప, ప్రకాశం, నెల్లూరు, అల్లూరి సీతారామరాజు జిల్లాల పోస్టులలో అన్యాయం జరిగిందని తగిన పోస్టులు మంజూరు చేయలేదని అభ్యర్థులు ఆందోళన చెందుతున్నారనీ వారు అన్నారు. కావున తమరి ద్వారా ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకువెళ్లి అభ్యర్థులకు న్యాయం జరిగేలా అన్ని జిల్లాలకు స్థానిక అవసరాల రీత్యా పోస్టుల మంజూరు జరిగేలా , త్వరితగతిన డీఎస్సీ నోటిఫికేషన్ అన్ని వివరాలతో వెలువడేలా కృషి చేయాలని లేనిపక్షంలో అఖిల భారత యువజన సమాఖ్య గా ఉద్యమాలు చేస్తామని అన్నారు.ఈ కార్యక్రమం విష్ణు, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

# భారత రాష్ట్రపతి ద్రౌపది ముర్ము అల్పాహార విందుకు ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.



ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా మార్చి 17:
సోమవారం సాయంత్రం ఢిల్లీ లోని రాష్ట్రపతి భవనంలో రాష్ట్రపతి ద్రౌపది ముర్ము ఆతిథ్యంలో ఏర్పాటు చేసిన అల్పాహార విందుకు తోటి పార్లమెంటు సభ్యులతో కలిసి నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి హాజరయ్యారు.రాష్ట్రపతి ఆహ్వానం ఎంతో గౌరవంగా, స్ఫూర్తిదాయకంగా అనిపించిందని, దేశ సేవలో అంకితభావంతో పనిచేస్తున్న మేమంతా ఒకే వేదికపై కలుసుకోవడం ఆనందదాయకంగా, మధుర జ్ఞాపకంగా ఉందని నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి అన్నారు.

# ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టండి

**-నంద్యాల ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి.**



**ఆంధ్రప్రగతి**
**నంద్యాల జిల్లా మార్చి 17:**
నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెట్టాలని భారత పౌర విమానాయ శాఖ మంత్రి కింజారపు రామ్మోహన్ నాయుడుకు నంద్యాల పార్లమెంట్ సభ్యురాలు, లోక్ సభ టీడీపీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ డాక్టర్ బైరెడ్డి శబరి వినతి పత్రం అందించారు.
సోమవారం ఢిల్లీలోని కేంద్ర పౌర విమానాయశాఖ మంత్రి కె. రామ్మోహన్ నాయుడును ఆయన కార్యాలయంలో ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి మర్యాద పూర్వకంగా కలిసి వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం నంద్యాల జిల్లా ఓర్వకల్లు విమానాశ్రయానికి ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు పెడతామని తెలిపి ఆయన పేరు పెట్టకుండా రాయలసీమ ప్రజలను విస్మరించారని విమర్శలు చేశారు. బ్రిటిష్ వారిపై తొలి తిరుగుబాటునేత, తొలి స్వాతంత్ర్య సమరయోధుడు, రాయలసీమ ముద్దుబిడ్డ ఉయ్యాలవాడ నరసింహారెడ్డి పేరు ఓర్వకల్లు విమానాశ్రాయానికి పెట్టాలని ఎంపీ డాక్టర్ బైరెడ్డి శబరి కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడును కోరారు. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు సానుకూలంగా స్పందించడం పట్ల ఆమె ధన్యవాదములు తెలిపారు.

# ఐఎఫ్ఎల్ఎస్ ఫైనాన్స్ సర్వీసెస్ ఆఫీస్ ను ప్రారంభించిన ఎన్ఎండి ఫిరోజ్.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల రూరల్ మార్చి 17:**నంద్యాల మండలం పోలూరు గ్రామంలో ఐఎఫ్ఎల్ఎస్ పోలూరు బ్రాంచ్ మేనేజర్ తిరుపాల్ రెడ్డి గారు నూతనంగా ఏర్పాటుచేసిన ఐఎఫ్ఎల్ఎస్ ఫైనాన్స్ సర్వీసెస్ ఆఫీస్ ను నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడతు లోన్ కోసం ఎక్కడెక్కడో తిరగాల్సిన అవసరం లేదని అధిక వడ్డీలకు డబ్బులు తీసుకోవాల్సిన అవసరం లేదని ఎవరికైనా లోన్ కావాలంటే తక్కువ వడ్డీతో ఐఎఫ్ఎల్ఎస్ ఫైనాన్స్ సర్వీసెస్ వారు లోన్స్ సౌకర్యం కల్పిస్తారన్నారు ఈ అవకాశాన్ని ప్రజలందరూ ఉపయోగించుకోవాలని తెలియజేశారు.
ఈ కార్యక్రమంలో నంద్యాల బ్రాంచ్ మేనేజర్ మనోహర్, మేనేజింగ్ డైరెక్టర్ సురేష్, జోజీ రెడ్డి , జయచంద్ర రెడ్డి, చూరి, కిరణ్ కుమార్ రెడ్డి, ఆస్మా , పక్కి రెడ్డి, అయూబ్, ఇసుక చాంద్ , ఉప్పరి సురేష్ కుమార్, బద్రిశెట్టి రవి , తదితరులు పాల్గొన్నారు.

# బండలాగుడు పోటీలను ప్రారంభించిన ఫిరోజ్.





**ఆంధ్రప్రగతి ఓర్వకల్లు మార్చి 17:** ఓర్వకల్ మండలం కాల్వ గ్రామంలో హజరత్ సయ్యద్ మహమ్మద్ షాఖాద్రి స్వాములవారి ఉరుసు మహోత్సవం సందర్భంగా గురువులు సయ్యద్ షహబుద్దీన్ షాఖాద్రి , సయ్యద్ ఖమర్ షాఖాద్రి వారిచే కాల్వ గ్రామ టిడిపి అధ్యక్షులు రజాక్ భాష ఆధ్వర్యంలో పాల బండ లాగుడు పోటీలు నిర్వహించడం జరిగిందని ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ హాజరై పోటీలను ప్రారంభించడం జరిగిందన్నారు. అనంతరం హజరత్ సయ్యద్ మహమ్మద్ షాఖాద్రి స్వాములవారిని ఫిరోజ్ దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించడం జరిగింది.

# నంద్యాల లో విత్తన ధ్రువీకరణ సంస్థ సంచాలకుల పర్యటన.





**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 17:**
ఏపీ ఎస్ ఎస్ సి ఎ డైరెక్టర్ డాక్టర్ వై సతీష్ నంద్యాల పర్యటనలో భాగంగా మహానంది మండలం తమ్మడపల్లి గ్రామంలో మరియు నందిపల్లి గ్రామంలో విస్తృతంగా పర్యటించారు ఈ పర్యటనలో భాగంగా ఆర్ఎన్ఆర్- 15048, బిపిటి-5204, ఎన్ డి ఎల్ ఆర్ -7, విత్తన ఉత్పత్తికి సంబంధించిన వరి వంగడాలను తనిఖీలు నిర్వహించారు. రైతులతో మరియు విత్తన ఉత్పత్తిదారులతో ముఖాముఖి సంభాషిస్తూ పంట సమయంలో కేలీలను గుర్తించి వాటిని నివారించి అత్యధిక పంట దిగుబడి కి ప్రధానమైన చర్యలను తీసుకోవాలని వారు కోరారు.అంతేకాకుండా విత్తన ధ్రువీకరణ అధికారులు క్షేత్రస్థాయిలో విత్తనాలను పరిశీలించి రైతాంగానికి నాణ్యమైన విత్తనాలను అందే విధంగా సహాయపడాలని విత్తన ధ్రువీకరణ అధికారులకు డైరెక్టర్ వై సతీష్ సూచించారు అనంతరం నంద్యాల ఏపీ ఎస్ఎస్సి ఏ కార్యాలయం నందు నిర్వహించిన కార్యక్రమంలో విత్తన ఉత్పత్తిదారులతో సంభాషించి వారి యొక్క విన్నపాలను స్వీకరించి విత్తన ఉత్పత్తిలో నూతన విధానాలను తెలుసుకోవలసిన తగు జాగ్రత్తలు డైరెక్టర్ డాక్టర్ వై సతీష్ సూచించారు. ఈ పర్యటనలో జాయింట్ డైరెక్టర్ సిహెచ్ రాధిక, సి ఎస్ సి ఓ విశ్వనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# టిడ్కో గృహాల సమస్యలను పరిష్కరించి లబ్ధిదారులకు పంపిణీ చేయాలి.

**-సిపిఎం పార్టీ డిమాండ్**




ఆంధ్ర ప్రగతి నంద్యాల,మార్చి 17:
టిడ్కో గృహాలను అర్హులైన పేదలందరికీ, లబ్ధిదారులకు పంచకపోతే సిపిఎం గా భవిష్యత్ కార్యాచరణ రూపొందిస్తాం అవసరమైతే ప్రజలను సమీకరించి ఆక్రమించుకుని పంపిణీ చేస్తాం ప్రభుత్వాన్ని హెచ్చరించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె ప్రభాకర్ రెడ్డి నంద్యాల పట్టణంలో ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రజా చైతన్య యాత్ర చివరి రోజు పాదయాత్రలో నందమూరి నగర్, వైయస్సార్ నగర్ ప్రాంతాలలోని విధుల్లో, ఎస్సార్ బీసీ టిడ్కో గృహాలను పరిశీలిస్తూ పాదయాత్ర నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు, పార్టీ సీనియర్ నాయకులు తోట మద్దులు, సిపిఎం పట్టణ కార్యదర్శి లక్ష్మణ్, పట్టణ కార్యదర్శి వర్గ సభ్యులు పి నరసింహ, కె మహమ్మద్ గౌస్, వెంకట లింగం, పట్టణ కమిటీ సభ్యులు మౌలాలి, వీరితో పాటు సిపిఎం కార్యకర్తలు సుబ్బారావు, బుజ్జి ఆంజనేయులు, రానా, షఫీ,హరి, శ్రీనివాసులు, లతోపాటు మరో 30 మంది పాల్గొనడం జరిగింది. అనంతరం సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు కె. ప్రభాకర రెడ్డి, సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఏ నాగరాజు లు మాట్లాడుతూ నంద్యాల పట్టణం లోని టిడ్కో గృహాలు కు దాదాపుగా 13 వేల మందికి పైగా అప్లై చేసుకున్నారని గత టిడిపి ప్రభుత్వ హాయం నుండి వైసీపీ ప్రభుత్వ హయాంలో కొంతమంది ఎనిమిది వేల మందికి పైగా లబ్ధిదారులు అర్హత కలిగిన వారికి ఇచ్చారని, అయితే మిగిలిన 5వేలకు పైగా గృహాలు ఖాళీగా ఉన్నాయని,నిర్మాణ దశలో ఉన్నాయని, వాటి గురించి పట్టించుకునే నాధుడే కరువయ్యారని, టి డ్కో గృహాలలో చేరేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని, అయితే అక్కడ ఎలాంటి మౌలిక వసతులు లేకపోవడం వలన ప్రజలు అక్కడికి వెళ్లాలంటే వెళ్లడం లేదని అన్నారు. ఇప్పటికే ఎస్ఆర్బిసి టిడ్కో గృహాలలో ఉన్న ప్రజలు సమస్యలతో జీవితాన్ని గడుపుతున్నారని, ముఖ్యంగా వాటర్ సప్లై సరిగా లేకపోవడం ఇంటి చుట్టూ చెత్త,పిచ్చి మొక్కలు ఉండడం వలన పాము, తేళ్ళ వంటి విష జీవులతో భయాందోళనకు గురవుతున్నారని, తాగేందుకు మంచినీరు కల్పించలేదని అక్కడ వెంటనే రెండు వాటర్ ట్యాంక్ లను ఏర్పాటు చేయాలని, పెన్షన్ తీసుకునే వృద్ధులు, వితంతువులకు పట్టణంలోకి వచ్చే తీసుకోవాలని చెబుతున్నారని,రేషన్ సరుకుల బండి రావడం లేదని రాత్రి వేళల్లో దొంగతనాలు జరుగుతున్నాయని, పోలీస్ అవుట్ పోస్ట్ ఏర్పాటు చేస్తే అసాంఘిక కార్యకలాపాలు అడ్డుకట్ట వేసిన వారవుతారని, అలాగే ఎంతోమంది చిన్న పిల్లలు ఉన్నారని అంగన్వాడి కేంద్రం, స్కూలు, హాస్పిటల్ లను ఏర్పాటు చేస్తే బాగుంటుందని అక్కడి ప్రజలు సమస్యలను వివరించారని తెలిపారు. ఇన్ని రకాల సమస్యలను పెట్టుకుని అక్కడ వెళ్లేందుకు ప్రజలు ఇష్టపడడం లేదని కుంటి సాకులు చెప్పడం సరైనది కాదని సమస్యలన్నిటినీ పరిష్కారం చేయాలని లేకుంటే సిపిఎం పార్టీగా టీడ్కో గృహాలపైనే భవిష్యత్ కార్యాచరణ ఉంటుందని ఉన్నారు. అదేవిధంగా వైఎస్సార్ నగర్ లో కాల్వలు, రోడ్లు, వీధి లైట్స్ వేయించాలని వెంటనే సమస్య లను పరిష్కరం చేయాలని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుండి ఇప్పటివరకు ప్రజా ప్రతినిధులు ఎవరు కన్నెత్తి చూడడం లేదని ఎన్నికల సమయంలో గుర్తు వస్తాము తర్వాత పూర్తిగా మమ్మల్ని మర్చిపోయి మా జీవితాలతో చెలగాటమాడుతున్నారని, దోమలపై దండయాత్ర అంటూనే ఫాగింగ్ కి మేము గుర్తు రాలేదని మమ్మల్ని పూర్తిగా మరిచిపోయారని నంద్యాల పట్టణానికి మాకు సంబంధం లేదు అనే విధంగా అధికారులు ప్రజా ప్రతినిధులు వ్యవహరిస్తున్నారని అన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ ప్రకారం మహిళలందరికీ ఇంట్లో ఎంత మంది ఉంటే అంతమందికి నెలకు 1500 ఇస్తామన్న హామీని,ఉచిత బస్సు ప్రయాణ హామీని నెరవేర్చాలని ఇంట్లో ఎంతమంది చిన్నపిల్లలు ఉంటే వారందరికీ తల్లికి వందనం అమలు చేయాలని, ఒక సంవత్సరం అందర్నీ మభ్యపెట్టే ప్రయత్నం చేశారని అన్నారు. ఎండాకాలం లో ఇంట్లో ఫ్యాన్ వేసుకోవాలంటే కరెంటు చార్జీలు పెరగడం వలన భయాందోళనకు గురవుతున్నామని, గతంలో 200/- వస్తే 500/-, 500 రూపాయలు వస్తే ఇప్పుడు 1500 రూపాయలు కరెంటు బిల్లు వచ్చేలా పెరగడం వలన కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీలను నిలబెట్టుకోలేక పోయిందని అన్నారు.ప్రజల్లో తిరుగుబాటు సంవత్సరం కాకముందే మొదలైందని కూటమి ప్రభుత్వం ఇచ్చిన సూపర్ సిక్స్ హామీలు ఇప్పుడు నెరవేరుస్తాం అప్పుడు నెరవేరుస్తామని కాలం వెళ్లబుచ్చుతుందని, ఇప్పటికైనా కళ్ళు తెరుచుకోకపోతే ప్రజల తిరుగుబాటుతో కూటమి ప్రభుత్వానికి గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

# పోలీస్ ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి 72 ఫిర్యాదులు.

**-విచారణ జరిపి చట్ట పరిదిలో న్యాయం చేస్తాం. -జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా.**




ఆంధ్ర ప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మార్చి 17:
నంద్యాల జిల్లా బొమ్మలసత్రం వద్ద గల జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన "ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అధిరాజ్ సింగ్ రాణా ఫిర్యాదిదారుల నుంచి 72 ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా ప్రజల ఇచ్చిన ఫిర్యాదులపై పూర్తిస్థాయి విచారణ జరిపి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. చట్ట పరిధిలో చట్టపరంగా ఉన్న సమస్యలకు తక్షణమే పరిష్కారం చూపాలని , ఫిర్యాదులను మళ్ళీ పునరావృతం కాకుండా చూడాలని , నిర్ణీత గడువు లోపల ఫిర్యాదులను పరిష్కరించాలని, ఫిర్యాదుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని సంబంధిత అధికారులతో చట్ట పరిధిలో సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఆదేశించారు.ఈ ఫిర్యాదులలో కుటుంబ కలహాలు, అత్తారింటి వేధింపులు, అన్నదమ్ముల ఆస్తి తగాదాలు మొదలగునవి ఉన్నాయి. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ దూర ప్రాంతాల నుండి జిల్లా పోలీస్ కార్యాలయానికి రాలేని వారు ప్రతి సోమవారం మీకు దగ్గరలోని పోలీస్ స్టేషన్, సర్కిల్ ఆఫీస్, డిఎస్పి కార్యాలయాల్లో జరిగే "ప్రజా సమస్యల పరిష్కార వేదిక



"కార్యక్రమంలో ఫిర్యాదు చేయవచ్చని వాటిని కూడా ఫిర్యాదులుగానే పరిగణించి సకాలంలో న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్పీ తో పాటు నంద్యాల సబ్ డివిజన్ ఏ ఎస్ పి మంద. జావళి ఆల్ఫోన్స్ పాల్గొన్నారు.

# రాయల్ ఇంగ్లీషు మీడియం స్కూల్ ఆధ్వర్యంలో 500ల ఈద్ కీట్ల పంపిణీ.



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 17: తాహెరా హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రాయల్ స్కూల్ యాజమాన్యం వారు డాక్టర్ వి. యాఖుబ్ మరియు వారి సోదరులు వి. ఇసాక్ వలి రమదాన్ నెల సందర్భంగా నిరుపేద ప్రజలకు వారు జకాత్ రూపంలో 500 ఈద్ కిట్ల పంపిణీ కార్యక్రమం చేపట్టారు. డాక్టర్ వి యాకుబ్ %ు% అతవుల్లా ఖాన్ మాట్లాడుతూ ఇస్లాం ధర్మానుసారం సంపాదించినా మొత్తం నుండి జకాత్ తీయవలసివుంటుంది కావున ఈ జకాత్ రూపంలో తీసిన డబ్బుతో గత 15 సంవత్సరాలుగా నిరుపేద కుటుంబాలకు ఈద్ కిట్లను పంపిణి చేయటం ఆనాయితీగా జరుగుతుందని దీని ఫలితంగా పేద కుటుంబాలు కూడా అందరిలాగే పండుగను తాహెరా హెల్త్ అండ్ ఎడ్యుకేషనల్ సొసైటీ ఆధ్వర్యంలో రాయల్ స్కూల్ యాజమాన్యం వారు డాక్టర్ వి. యాఖుబ్ మరియు వారి సోదరులు వి. ఇసాక్ వలి రమదాన్ నెల సందర్భంగా నిరుపేద ప్రజలకు వారు జకాత్ రూపంలో 500 ఈద్ కిట్లను పంపిణీ చేశారుకార్యక్రమంలో ముఖ్య అతిథిగా ముస్లిం మాతాపెద్దలు అబ్దుల్ హాది మరియు ఎస్ డి పి ఐ పార్లమెంట్ నాయకులు అతవుల్లా ఎస్ డి పి ఐనంద్యాల పట్టణ అధ్యక్షులు ఏజాజ్ షరీఫ్ గారు పాల్గొన్నారు వారి చేతులమీదుగా పేద ప్రజలకు అందజేశారు. ప్రముఖ ముస్లిమ్ మత పెద్దలు, మౌలానా అబ్దుల్ హాది, మాట్లాడుతూ గత పన్నెండు సంవత్సరాలుగా వీరు ఈ చేస్తున్న సేవలు అభినందించదగినవని అల్లా కృప ఆశీస్సులు వీరిపై ఎల్లవేళలా ఉండాలని తెలిపిఈ కార్యక్రమంలో రాయల్ ,నారాయణ స్కూల్ అధినేత ఇషాక్ వలి,ఖాజాహుస్సేన్ యూసుబ్ నావభారత్ హుస్సేన్ ,శ్రీ సాయి వాణి స్కూల్ కరస్పాండెంట్ హుస్సేన్ భాష , ఉపాధ్యాయని ఉపాధ్యాయులు మరియు బంధు మిత్రులు పాల్గొన్నారు.

# పిజిఆర్ఎస్ ఫిర్యాదుల పరిష్కారంపై ప్రజల అభిప్రాయాలు సేకరించండి.

**-రీ ఓపెన్ దరఖాస్తులను వెంటనే పరిష్కరించండి. -ఇప్పటివరకు 27,854 ఫిర్యాదులను పరిష్కరించాం.**

**-పిజిఆర్ఎస్ కు 209 దరఖాస్తులు. -జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**






ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి 17:
ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమం ద్వారా ఇప్పటివరకు స్వీకరించిన 30,058 దరఖాస్తులకు గాను 27,854 ఫిర్యాదులను పరిష్కరించామని ఇందుకు సంబంధించి సంబంధిత అర్జీదారుల నుండి అభిప్రాయాలు సేకరించాలని జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి మాట్లాడుతూ ఇప్పటివరకు పరిష్కరించిన 27,854 ఫిర్యాదుదారుల నుండి అభిప్రాయాలు సేకరించాలన్నారు. పెండింగ్ లో ఉన్న 2,157 దరఖాస్తులను కూడా ప్రత్యేక దృష్టి సారించి నిర్ణీత కాల పరిమితిలోపు నాణ్యతతో పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయాల ద్వారా చేపట్టిన సర్వే వివరాలు సేకరించాలన్నారు పెండింగ్లో ఉన్న 5,444 మంది మిస్సింగ్ సిటిజన్ డేటా, 195 మంది ఎంప్లాయిస్ డేటా, 14,141 హౌస్ హెూల్డ్ జియో ట్యాగింగ్ డేటా, నందికొట్కూరు, ఆత్మకూరు, ఆళ్లగడ్డ, డోన్ పట్టణ ప్రాంతాలలోని ఎంఎస్ఎంఈ, పి4 తదితర పెండింగ్ సర్వేలన్నింటినీ త్వరితగతిన పూర్తి చేసేందుకు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని మున్సిపల్ కమీషనర్లు, డిఎల్డిఓలు, ఎంపీడీఓలను కలెక్టర్ ఆదేశించారు. సమస్యను సరైన రీతిలో పరిష్కరించకుండా ఫిర్యాదులను ఎట్టి పరిస్థితుల్లో ముగించరాదని కలెక్టర్ స్పష్టం చేశారు. క్షేత్రస్థాయిలో విచారించి పరిష్కరించిన ఫోటోలను అప్లోడ్ చేయాలన్నారు. ఫిర్యాదుదారులు సంతృప్తి చెందేలా ఎండార్స్ ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు.

1)బేతంచర్ల మండలంలోని బైలుపేట కాపురస్థురాలు ఫైజున్ బీ తను గత 12 సంవత్సరాలుగా ప్రభుత్వ గృహానికి అర్జీ పెడుతున్నప్పటికి ఇప్పటి వరకు మంజూరు కాలేదని తనకు ప్రభుత్వ గృహమును మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.

2) నందికొట్కూరు మండలం దామగట్ల గ్రామంలో ఇంతకు ముందు బిఎస్ఎన్ఎల్ సెల్ టవర్ నిర్మించుటకు వస్తే గ్రామ ప్రజలు, సర్పంచ్ కలసి నిర్మించకుండా అడ్డుకున్నామని ప్రస్తుతం మళ్లీ సెల్ టవర్ నిర్మించుటకు సన్నాహాలు చేస్తున్న నేపథ్యంలో గ్రామంలోని ప్రజలు ఆరోగ్యం పరంగా ఇబ్బందులకు గురవుతారని సెల్ టవర్ నిర్మాణాన్ని ఆపాలని కోరుతూ దామగట్ల గ్రామ ప్రజలు జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు ను సమర్పించుకున్నారు.

3) ఆళ్ళగడ్డ మండల కేంద్రానికి చెందిన మహేశ్వరమ్మ తన భర్త ఆక్సిడెంట్ లో మరణించి 5 సంవత్సరాలు అయిందని ఇప్పటి వరకు వితంతు పెన్షన్ మంజూరు కాలేదని తనకు వితంతు పెన్షన్ మంజూరు చేయాలని కోరుతూ జిల్లా కలెక్టర్ కు దరఖాస్తు సమర్పించుకున్నారు.

ఇంకా ఈ కార్యక్రమంలో 209 మంది అర్జీదారులు తమ సమస్యల పరిష్కారానికి జిల్లా కలెక్టర్ కు అర్జీలు సమర్పించారు. ఈ సమస్యలన్నీ విథిన్ ఎస్ఎల్ఏ లోగా పరిష్కరించాలని సంబంధిత అధికారులకు ఎండార్స్ చేస్తూ కలెక్టర్ ఆదేశాలు జారీ చేశారు.

# అభివృద్ధి సంస్థల కోసం ప్రభుత్వ స్థలాలను అన్వేషించండి.

**-జిల్లా కలెక్టర్ శ్రీమతి రాజకుమారి గణియా.**




**ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి, 17:**
జిల్లాలోని అభివృద్ధి సంస్థల ఏర్పాటుకు ప్రభుత్వ స్థలాలను గుర్తించాలని జిల్లా కలెక్టర్ జి.రాజకుమారి సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు ముందు వివిధ అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ ఎంఎస్ఎంఈ పార్కులు, కుసుమ్ కార్యక్రమం క్రింద విద్యుత్ సబ్ స్టేషన్లు, రిలయన్స్ సంస్థ వారిచే కంప్రెస్డ్ బయో గ్లాస్ ప్లాంట్లు, స్టార్ హెూటళ్లు, ఐటిఐ సంస్థల ఏర్పాటుకు డివిజన్ల పరిధిలో ప్రభుత్వ స్థలాలను అన్వేషించాలని సూచించారు. విద్యుత్ సబ్ స్టేషన్ లకు 5 నుండి 10 ఎకరాలు, ఎంఎస్ఎంఈ పార్కుల ఏర్పాటుకు 50 నుండి 100 ఎకరాలను స్థలాలను గుర్తించాలన్నారు. నంద్యాల జిల్లాలో రెండు స్టార్ హెూటల్స్ రానున్నాయని...రెవెన్యూ, ఇరిగేషన్, ఆర్ అండ్ బీ శాఖలకు చెందిన భూములను గుర్తించాలన్నారు. స్టార్ హెూటల్ నిర్మాణానికి 2 నుండి 3 ఎకరాల భూమిని గుర్తించాలన్నారు. జాతీయ రహదారి శివారు ప్రాంతాలు, లేక్ వ్యూ, హిల్ వ్యూలతో కూడిన భూములను పరిశీలించాలని జాయింట్ కలెక్టర్ ను సూచించారు. నంద్యాల పట్టణంలో స్టార్ హెూటల్ ఏర్పాటు చేసే అంశాన్ని కూడా పరిశీలించాలని నంద్యాల ఆర్డీఓను కలెక్టర్ ఆదేశించారు. రిలయన్స్ సంస్థ ఏర్పాటుచేసే కంప్రెస్డ్ బయో గ్యాస్ ఏర్పాటుకు స్థలాలను పరిశీలించాలన్నారు. ఇందుకోసం రిలయన్స్ కంపెనీ బృందాలు జిల్లాకు వచ్చి స్థల పరిశీలన అంశంపై నంద్యాల ఆర్డీఓను వివరాలు అడిగి తెలుసుకున్నారు. అలాగే ఐటిఐ కళాశాల ఏర్పాటు కోసం రెండు ఎకరాల భూమిని కేటాయించేలా స్థలాలను అన్వేషించాలన్నారు.

# మానభంగం కేసులో ముద్దాయికి యావజ్జీవ కారాగార జైలు శిక్ష.

**-రు 10,000/- జరిమాన.**

**-తప్పు చేసిన వారికి శిక్ష పడేలా చర్యలు తీసుకుంటున్నా నంద్యాల జిల్లా పోలీసులు.**




**ఆంధ్రప్రగతి నంద్యాల జిల్లా క్రైమ్ మార్చి 17:**
సంజామల పోలీసు స్టేషన్ క్రైమ్ నెంబర్: 227/2020 యు/సెక్షన్ 376, 506 ఐపీసీ ఉప్పు నాగ హరిక్రిష్ణ, పెరుసోముల గ్రామం , సంజామల మండలం 03/04.12.2020 రాత్రి సుమారు 2.00 గంటలకు ఎస్సార్ బీసీ కాలువ, పేరుసోముల గ్రామం, సంజామల మండలము లో జరిగింది. ఫిర్యాది తన తమ్ముడితో పాటు పేరుసోముల గ్రామం లోని కంబగిరిస్వామి గుడికి వచ్చి గుడిలో ఉండగా పిర్యాది తమ్ముడు కనిపించకుండా పోగా పిర్యాది అతని కోసం వెతుకుతుండగా పైన తెలిపిన ముద్దాయి పిర్యాదికి మాయమాటలు చెప్పి తన తమ్ముడిని వెతుదామని మోటార్ సైకిల్ పై ఎక్కించుకొని పెరుసోముల ఊరి బయటగల జి ఎన్ ఎస్ ఎస్ కాలువ దగ్గరకు తీసుకోని వెళ్లి బలవంతముగా మానభంగ%శీ% చెసినాడు. ఫిర్యాది సదరు విషయంపై సంజామల పోలీసు స్టేషన్ నందు ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి సంజామల ఎస్ఐ తిమ్మారెడ్డి కేసు నమోదు చేయగా కోయలకుంట్ల సీఐ గా పనిచేసిన బి.సుబ్బారాయడు, సీఐ విచారణ చేసి చార్జ్ షీట్ దాకలు చెయ్యడం జరిగింది. సదరు కేసుపై నంద్యాల జిల్లా ఎస్పీ అధిరాజ్ సింగ్ రాణా ప్రత్యేక పర్యవేక్షణ ద్వారా ఆళ్లగడ్డ సబ్ డివిజన్ డి.ఎస్.పి కే. ప్రమోద్ సూచనలతో ప్రస్తుతం ఉన్న సంజామల ఎస్ఐ సి. రమణయ్య మరియు కోయలకుంట్ల సీఐ గారైన హనుమంతు నాయాక్ సాక్షులను సకాలంలో కోర్టులో హాజరుపరచడం జరిగింది. పీపీ నరేంద్రనాథ రెడ్డి తమ వాదనలు వినిపించగా కర్నూలు గారైన వి. లక్ష్మీరాజ్యం విచారణ అనంతరం నేరం రుజువైనందున ముద్దాయికి రు 10,000/- జరిమాన మరియు జీవిత కారాగార శిక్ష విదిస్తూ తీర్పు ఇవ్వడం జరిగింది.

# టెన్త్ విద్యార్థులు మంచి ఫలితాలు సాధించాలి

**-సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి.**

**-పదో తరగతి విద్యార్థులకు 'ఆల్ ది బెస్ట్' చెప్పిన ఫిరోజ్.**



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 17:**
ఏపీలో మార్చి 17 నుంచి ఏప్రిల్ 1 వరకు 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు జరగనున్నాయన్నారు .. 10 వ తరగతి పబ్లిక్ పరీక్షలు రాసే విద్యార్థినీ , విద్యార్థులకు నంద్యాల టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్ఎండి ఫిరోజ్ ఆల్ ది బెస్ట్ తెలియజేశారు.ఈ సందర్భంగా స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు ఏర్పాటుచేసిన సమావేశంలో ఎన్ఎండి ఫిరోజ్ మాట్లాడుతూ .. టెన్త్ క్లాస్ విద్యార్థులు పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి నంద్యాలకు మంచి పేరు తీసుకుని రావాలని కోరుకుంటూ విద్యార్థినీ , విద్యార్థులకు ఆల్ ది బెస్ట్ చెప్పారు. విద్యార్థులు నియమనిబంధనలు తప్పనిసరిగా పాటించాలని, సకాలంలో పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలని ఫిరోజ్ సూచించారు. సమయాన్ని సద్వినియోగం చేసుకుని పరీక్షలు పూర్తి చేయాలని అన్నారు.

# పదవ తరగతి విద్యార్థులకు అరగంట ఆలస్యంగా అందజేసిన ప్రశ్నాపత్రాలు.



ఆంధ్ర ప్రగతి చాగలమర్రి మార్చి 17:
రాష్ట్ర వ్యాప్తంగా పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ఈనెల 17వ తేదీ సోమవారం నుంచి మొదలు కావడం జరిగింది. ప్రభుత్వం వారు విద్యార్థుల యొక్క పరీక్ష సమయాన్ని ఉదయం 9:30 నుంచి మధ్యాహ్నం 12:45 వరకు సమయాన్ని ఇవ్వడం జరిగింది. చాగలమరి గ్రామం నందు బాలుర ఉన్నత పాఠశాల, బాలికల ఉన్నత పాఠశాల మరియు సెయింట్ ఆన్స్ స్కూల్ నందు పదవ తరగతి విద్యార్థులు పరీక్షలు రాయడం జరిగింది. ఈ మూడు పరీక్ష కేంద్రాల నందు విద్యార్థులకు ఉదయం 9:30 నిమిషాలకు అందజేయవలసిన క్వశ్చన్ పేపర్ 10 గంటలకు అందజేయడం జరిగింది. విద్యార్థులకు అరగంట ఆలస్యంగా అందజేసిన విద్యార్థుల జవాబు పత్రం మాత్రం మధ్యాహ్నం 12:45 నిమిషాలకు ఇన్విజిలేటర్లు తీసుకోవడం జరిగిందని ప్రశ్న పత్రం అరగంట ఆలస్యంగా ఇచ్చినందుకు గాను పరీక్ష యాజమాన్య సిబ్బంది విద్యార్థులకు పరీక్ష రాయడానికి కూడా అరగంట సమయాన్ని పొడిగించాల్సి ఉందని కానీ వారు ఆ సమయాన్ని పొడిగించలేదని దీనివల్ల తమకు అరగంట ఆలస్యమై పరీక్ష రాయడానికి సమయం సరిపోలేదని దానివల్ల తమకు మార్కులు చాలా వరకు తక్కువగా వచ్చే అవకాశం ఉందని విద్యార్థులువాపోయారు.ఇంకోసారి ఇటువంటి సంఘటనలు జరగకుండా పరీక్ష యాజమాన్యం విద్యార్థులకు సరైన సమయానికి ప్రశ్న పత్రాలు అందజేయాలని విద్యార్థులు మరియు వారి తల్లిదండ్రులు డిమాండ్ చేయడం జరిగింది.

# అంతరిక్షంలోకి వెళ్లిన మొదటి మహిళ కల్పనా చావ్లా సేవలు చిరస్మరణీయం.

**-సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి.**



ఆంధ్ర ప్రగతి డోన్ మార్చి 17: మార్చి 17 అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి మహిళ కల్పనా చావ్లా జయంతి సందర్భంగాడోన్ పట్టణంలో సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి ఆధ్వర్యంలో అంతరిక్షంలోకి వెళ్ళిన మొదటి మహిళ కల్పనా చావ్లా జయంతి సందర్భంగా వారి చిత్ర పటానికి పూలమాల వేసి ఘణంగా నివాళి అర్పించారు. వారిని స్మరించుకున్నారు.ఈ సందర్భంగా సామాజిక కార్యకర్త డోన్ పి. మహమ్మద్ రఫి మాట్లాడుతూ మన దేశ స్వాతంత్ర్య సమరయోధులను, శాస్త్రవేత్తలను ,మహనీయులను, సమాజానికి సేవలు అందించిన ప్రతి ఒక్కరిని స్మరించుకుంటూ వారి అడుగుజాడల్లో నడవాలని సామాజిక కార్యకర్త డోన్ పి.మహమ్మద్ రఫి కోరారు.

# ప్రజల నుంచి వచ్చిన పలు అర్జీలను స్వీకరించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.





**ఆంధ్ర ప్రగతి బనగానపల్లె మార్చి 17:**
ప్రజా సమస్యల పరిష్కారం కోసం వచ్చే అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని అధికారులకు రాష్ట్ర రోడ్లు , భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి సూచించారు.. నేటి ఉదయం బనగానపల్లెలోని మంత్రి క్యాంపు కార్యాలయంలో ప్రజల నుంచి వచ్చిన పలు విజ్ఞప్తులను మంత్రి స్వయంగా స్వీకరించడంతో పాటు కొన్ని సమస్యలకు పరిష్కారం చూపడం జరిగింది. మంత్రి ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ అర్జీల స్వీకరణ కార్యక్రమానికి జిల్లా వ్యాప్తంగా వివిధ వర్గాల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలి వచ్చారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ.. ప్రజల నుంచి వచ్చిన ఆయా సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి సాధ్యమైనంత త్వరగా పరిష్కరిస్తామని హామీ ఇవ్వడం జరిగింది. న్యాయబద్ధంగా ఉన్న సమస్యల విషయంలో సంబంధిత అధికారులతో అక్కడిక్కడే ఫోన్ లో మాట్లాడి పరిష్కరించడం జరిగింది. ఈ అర్జీలు స్వీకరణ కార్యక్రమంలో సమస్యలపై మంత్రి సానుకూలంగా స్పందించడంతో బాధితుల నుంచి సర్వత్రా సంతోషం వ్యక్తమైంది.

# ఎన్టీఆర్ సుజల స్రవంతి త్రాగునీటి ప్లాంటు ప్రారంభించిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి.

## -వైసిపి నిర్లక్ష్య ధోరణితో ఐదేళ్లపాటు నిరుపయోగంగా మారిన రూ. 4 కోట్ల విలువైన తాగునీటి పథకం.

## -మంత్రి చొరవతో తిరిగి ప్రారంభమైన ఎన్టీఆర్ సుజల స్రవంతి తాగునీటి పథకం.

**-వేసవిలో తాగునీటి కోసం ఏ ఒక్క గ్రామంలో కూడా ప్రజలు ఇబ్బంది పడకూడదు.**

**-కూటమి ప్రభుత్వంలో పంచాయితీలకు పూర్వవైభవం.**

**-ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున సిసి రోడ్లు నిర్మిస్తున్నాం.**

**-మే నెలలో తల్లికి వందనం పథకం అమలు చేస్తాం.**

**-మోడీ, బాబు, పవన్ త్రయంతోనే రాష్ట్ర అభివృద్ధి సాధ్యం.**





ఆంధ్ర ప్రగతి కొలిమిగుండ్ల మార్చి 17:
కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గ్రామ పంచాయతీలకు తిరిగి పూర్వవైభవం తీసుకురావడం జరిగిందని రాష్ట్ర రోడ్లు మరియు భవనాలు, పెట్టుబడులు, మౌలిక సదుపాయాల శాఖ మంత్రి బీ.సీ జనార్ధన్ రెడ్డి అన్నారు.. నేడు బనగానపల్లె నియోజకవర్గం కొలిమిగుండ్లలోని కస్తూరిబా పాఠశాల సమీపంలో ఉన్న ఎన్టీఆర్ సుజల స్రవంతి త్రాగునీటి మదర్ ప్లాంట్ పథకాన్ని మంత్రి బీ.సీ జనార్ధన్ రెడ్డి ప్రారంభించారు. గత మూడు సంవత్సరాలుగా మూతపడిన ఎన్టీఆర్ సుజల స్రవంతి త్రాగునీటి మదర్ ప్లాంటుకు మంత్రి బీ.సీ జనార్ధన్ రెడ్డి రూ. 4 లక్షల రూపాయలు వెచ్చించి మరమ్మత్తు పనులు చేయించారు. ఈ సందర్భంగా మంత్రి స్వయంగా వాటర్ ట్యాంకర్ తో కూడిన ట్రాక్టర్ ను నడపడం జరిగింది.. నేడు కొలిమిగుంట్లకు విచ్చేసిన మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డికి స్థానిక నాయకులు ఘన స్వాగతం పలికారు.. ఈ కార్యక్రమంలో కొలిమిగుండ్ల మండల ప్రజలు, కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.వైసిపి నిర్లక్ష్య ధోరణితో ఐదేళ్లపాటు నిరుపయోగంగా మారిన రూ. 4 కోట్ల విలువైన తాగునీటి పథకంఈ సందర్భంగా మంత్రి బీ.సీ జనార్ధన్ రెడ్డి మాట్లాడుతూ.. ఎన్టీఆర్ సుజల స్రవంతి త్రాగునీటి పథకం – మదర్ ప్లాంట్ ను తిరిగి ప్రారంభించడం సంతోషకరంగా ఉందన్నారు. 2018లో కొలిమిగుండ్ల చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలకు మినరల్ వాటర్ అందించడమే లక్ష్యంగా రూ. 3.79 కోట్లతో, నేను ఎమ్మెల్యేగా ఉండి ఈ బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టడం జరిగిందన్నారు. 2019 నాటికి ఈ పథకాన్ని పూర్తి చేసినప్పటికీ, ఎన్నికలకు రావడం ఈ పథకం మేము ప్రారంభించలేకపోయాం.. ఆ తర్వాత వచ్చిన వైసిపి ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి, అసమర్ధ ఎమ్మెల్యే కారణంగా రూ. 4 కోట్లు వెచ్చించి ఏర్పాటు చేసిన ఈ పథకం ఐదేళ్లు పాటు నిరుపయోగంగా మారింది. దీంతో మళ్లీ తిరిగి ఈ పథకానికి ప్రాణం పోయడం జరిగింది. ఈ పథకం ద్వారా మండలంలోని 26 గ్రామాలకు 6 టా ట్రాక్టర్ల ద్వారా ట్యాంకర్లతో మంచినీటిని అందించడం జరుగుతుంది. మదర్ ప్లాంట్ ద్వారా ఆయా గ్రామాల్లో అవసరమైన మేరకు తాగునీటిని అందజేయనున్నమని తెలిపారు. కొలిమిగుండ్ల మండలంలో అన్ని గ్రామాలలో ప్రజలకు తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. గతంలో మంచి నీటిని నిలువ చేసే ట్యాంకులు ఏర్పాటు చేసినప్పటికీ అవి పాడైపోవడంతో వృధాగా మారాయి. వీటిని మరమత్తులు చేసేందుకు రూ. 5 లక్షల వరకు ఖర్చు అవుతుందని స్థానిక ఎంపీడీవో తన దృష్టికి తీసుకురాగా 15 రోజుల్లో వాటిని తిరిగి పునరుద్ధరించే ప్రయత్నం చేస్తామన్నారు. వేసవిలో తాగునీటికి ఒక్కచోట కూడా ప్రజలు ఎవ్వరు ఇబ్బంది పడకూడదని గౌరవ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశించారన్నారు. వర్షాకాలం వచ్చే వరకు ప్రజలకు ఇబ్బంది ఉండకూడదని నిన్న నంద్యాలలో ఆర్ డబ్ల్యూఎస్, ఇరిగేషన్ శాఖలతో సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగిందన్నారు. గతంలో తెలుగుదేశం పార్టీ అధికారంలో ఉన్నప్పుడు ఇంకుడు గుంతలు, చెరువులు తవ్వడం ద్వారా భూగర్భ జలాలు పెరిగేవన్నారు. కానీ ఈ ప్రభుత్వం వచ్చాక అటువంటి అంశాలపై దృష్టి పెట్టకపోవడంతో ప్రస్తుతం కొలిమిగుండ్లలో మార్చి 15 నాటికే భూగర్భ జలాలు అడుగంటి, బోర్లు ఎండిపోయే పరిస్థితి నెలకొందన్నారు.ప్రజలకు తాగు నీటి ఇబ్బంది రాకూడదనే ఆలోచనతో కూటమి ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపట్టడం జరుగుతుందన్నారు. గతంలో నిర్వీర్యం అయిపోయిన గ్రామ పంచాయతీలకు నేడు కూటమి ప్రభుత్వంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు ఆధ్వర్యంలో మళ్లీ పూర్వ వైభవం తీసుకొచ్చే ప్రయత్నం చేస్తున్నామన్నారు. గత ప్రభుత్వంలో రాష్ట్రాన్ని అప్పులయంగా మార్చేసిన.. ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు ఏడు రాష్ట్రంలో అభివృద్ధి – సంక్షేమం రెండు సమానంగా తీసుకెళు న్నామన్నారు. నేడు ప్రతి గ్రామంలో పెద్ద ఎత్తున సిసి రోడ్లు వేస్తున్నామని గతంలో కనీసం 100 మీటర్ల రోడ్లు కూడా వేసిన పరిస్థితి లేదన్నారు.. నేడు ప్రతి గ్రామంలో రూ. 15 – 40 లక్షలతో రోడ్లు వేస్తున్నామన్నారు.. కొలిమిగుండ్ల పట్నం చుట్టుపక్కల ప్రాంతాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పిస్తామన్నారు.రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని, త్వరలో రేషన్ కార్డులుపై విచారణ అనంతరం కొత్త కార్డులు ఇస్తామన్నారు. ఇంట్లో ఎంతమంది పిల్లలు ఉన్నా అందరికీ తల్లికి వందనం మే నెలలో అందజేస్తామని




ఇప్పటికే ముఖ్యమంత్రి తెలియజేశారన్నారు. జూన్ లో రైతులకు అన్నదాత సుఖీభవ అందిస్తామన్నారు.
ఈ రాష్ట్రం అభివృద్ధి బాటలో ముందుకు సాగాలంటే మోడీ, బాబు, పవన్ త్రయంతోనే సాధ్యమని విశ్వసించిన ప్రజల నమ్మకాన్ని వమ్ము చేయకుండా రాష్ట్రంలో ప్రజలకు అన్ని సౌకర్యాలు కల్పిస్తూ పరిపాలన అందిస్తున్నామని తెలిపారు.. గ్రామ పంచాయతీలు అభివృద్ధి బాట పట్టాలంటే కూటమి ప్రభుత్వంతోనే సాధ్యమని ప్రజలు నమ్మి 164 చేట్లతో ఆశీర్వదించారన్నారు. ప్రజల ఇచ్చిన నమ్మకాన్ని నెరవేర్చాల్సిన బాధ్యత తమ ప్రభుత్వంపై ఉందన్నారు.

# లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు చర్యలు తీసుకోండి.

**-జిల్లా కలెక్టర్ రాజకుమారి గణియా.**

ఆంధ్ర ప్రగతి నంద్యాల, మార్చి, 17:
100 సంవత్సరాలు చరిత్ర కలిగిన నంద్యాల మున్సిపాలిటీలో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు పటిష్ట ప్రణాళిక రూపొందించుకొని పరిశుభ్రం చేసేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి రాజకుమారి మున్సిపల్ కమిషనర్లు, జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్లోని పిజిఆర్ఎస్ హాలులో జిల్లా నలుమూలాల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదుల స్వీకరణకు ముందు వివిధ అంశాలపై అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ సి.విష్ణుచరణ్, డిఆర్ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు జిల్లా అధికారులు పాల్గొన్నారు.
ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ జి. రాజకుమారి మాట్లాడుతూ నంద్యాల మున్సిపాలిటీ డంప్ యార్డులో పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపుకు మున్సిపల్ అధికారులతో పాటు జిల్లా అధికారులందరూ భాగస్వాములై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. నంద్యాల మున్సిపాలిటీ పరిధిలో ఉన్న 17 ఎకరాల్లో డంపింగ్




యార్డులో సుమారుగా 90 వేల మెట్రిక్ టన్నుల చెత్త ఉందని అందులో 6 ఎకరాల్లో ఉన్న చెత్తను రిక్లేమేషన్ (బయో మైనింగ్) చేసి ఖాళీ భూమిగా ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం జరిగిందని, అయితే ప్రాసెస్ చేసి వాటిని అక్కడి నుంచి తొలగించలేదన్నారు. ఇంకా 10 ఎకరాల్లో ఉన్న చెత్తను రిక్లేమేషన్ ద్వారా మొత్తం తొలగించి పచ్చదనంతో ఖాళీ ప్రదేశంగా తీర్చిదిద్దాలన్నారు. 1889లో నంద్యాల మున్సిపాలిటీగా ఆవిర్భవించినప్పటి నుండి పేరుకుపోయిన లక్ష మెట్రిక్ టన్నుల చెత్త తొలగింపు కార్యక్రమాన్ని అతిపెద్ద సవాల్ గా తీసుకొని విజయవంతం చేసేందుకు అధికారులందరూ సమాయత్తం కావాలన్నారు. ఈ అంశంపై పిజిఆర్ఎస్ లో ఆర్టీసీ డ్రైవర్లు, ప్రజల నుండి ఎన్నో మార్లు ఫిర్యాదులు రావడం జరిగిందని ఈ సమస్యను పరిష్కరిస్తే నంద్యాల జిల్లా ప్రజల మదిలో జిల్లా యంత్రాంగం ఎప్పటికీ గుర్తు పెట్టుకునే అవకాశం ఉంటుందని కలెక్టర్ అధికారులకు సూచించారు.ఆదివారం కర్నూలులో జరిగిన జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన అంశాలను త్వరితగతిన పరిష్కరించాలని కలెక్టర్ సంబధిత అధికారులను ఆదేశించారు. గోస్పాడు మండలంలోని కునూరు, తేళ్లపూరి గ్రామాల్లో త్రాగు నీటి అంశాన్ని ఫీల్డ్ విజిట్ చేసి పరిష్కరించాలని ఆర్వబ్ల్యూఎస్ అధికారులు, ఎంపిడిఓలను కలెక్టర్ ఆదేశించారు. సంగమేశ్వరం వద్ద కృష్ణానదిలో అనుమతులు లేకుండా నదిలోకి బోట్లు ప్రవేశించకుండా చర్యలు తీసుకోవాలని ఆత్మకూరు ఆర్డీఓను ఆదేశించారు. కొత్తపల్లి మండల పరిధిలో హెవీ లోడ్ వాహనలు తిరుగుతున్న నేపథ్యంలో సంబంధిత నివేదికలు ఇవ్వాలని కలెక్టర్ ఆర్టీఓను ఆదేశించారు. మైనర్ ఇరిగేషన్ ట్యాంకుల కింద ఉన్న భూముల ఆయకట్టు వివరాలను బోర్డులు ఏర్పాటు చేసి ప్రదర్శించాలన్నారు.

# సిపిఐ పేద ప్రజల పక్షాన పోరాటం చేస్తుంది.



**ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 17:**
నిరంతరం పేద ప్రజల పక్షాన నిలబడి పోరాడే పార్టీ భారత కమ్యూనిస్టు పార్టీ సిపిఐ అని నంద్యాల సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ అన్నారు.నంద్యాల పట్టణ శివారు ప్రాంతమైన నందమూరి నగర్ లో ఇంటి స్థలాల అర్జీదారుల సమావేశం శాఖ కార్యదర్శి హుస్సేన్సా అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఏఐటీయూసీ పట్టణ కార్యదర్శి డి శ్రీనివాసులు మహిళా సమాఖ్య జిల్లా అధ్యక్షురాలు లక్ష్మీదేవి మహిళా సమాఖ్య పట్టణ కన్వీనర్ సుశీలమ్మ హాజరైనారు. అనంతరం సిపిఐ పట్టణ కార్యదర్శి కె ప్రసాద్ మాట్లాడుతూ ఇల్లు లేని నిరుపేదల కోసం రాష్ట్రవ్యాప్తంగా సిపిఐ ఆధ్వర్యంలో పోరాటాలు నిర్వహించడం జరుగుతుంది. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీ ప్రకారం పట్టణాల్లో రెండు సెంట్లు ఇంటి స్థలం గ్రామాల్లో మూడు సెండ్ల ఇంటి స్థలాన్ని కేటాయించాలని డిమాండ్ చేశారు నంద్యాల పట్టణంలో ఇల్లు లేని వారు అనేకమంది ఉన్నారు త్వరగా వారిని గుర్తించి రాష్ట్ర ప్రభుత్వం ఇంటి పట్టాలు ఇచ్చి ఇల్లా నిర్మాణానికి ఐదు లక్షల హౌసింగ్ లోన్ ఇవ్వాలని డిమాండ్ చేశారు.అనంతరం నందమూరి నగర్ లో ఇంటి స్థలాల అర్జీదారుల నూతన కమిటీని 15 మందితో ఎన్నుకోవడం జరిగింది. ఈ కార్యక్రమంలో నందమూరి నగర్ ఇంటి స్థలాల అర్జీదారు లు పాల్గొన్నారు.

# జిల్లాలో ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో త్రాగునీటీ వసతి కల్పించాలి.

**-భారత విప్లవ కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్.**



ఆంధ్ర ప్రగతి నంద్యాల మార్చి 17:
నంద్యాల జిల్లాలోని ప్రతి గ్రామ మండల డివిజన్ పరిధిలలో వుండే ప్రభుత్వ కార్యాలయాలలో ప్రజల కోసం త్రాగునీటి వసతిని ఏర్పాటు చేయాలని భారత విప్లవ కమ్యూనిస్ట్ పార్టీ జిల్లా కార్యదర్శి గాలి రవిరాజ్ డిమాండ్ చేశారు అనంతరం ఆయన మాట్లాడుతూ జిల్లాలోవున్న ప్రతి ప్రభుత్వ కార్యాలయాలలో ట్రాగునిటీ వసతులు కల్పించాలని ప్రతిరోజు నిత్యం వందలాది మంది తమ పనుల నిమిత్తం ప్రభుత్వ కార్యాలయాలకు వస్తున్నారు అసలే ఎండకాలం ఎండలు మండుతున్నాయి. అలాంటి వారి కోసం చలువ పందిండ్లు నీటి వసతి ఏర్పాటు చెయ్యాలని అధికారులను కోరుతున్నామన్నారు వెంటనే జిల్లా కలెక్టర్ ఆయా, ఆయా శాఖ జిల్లా అధికారులకు, స్వచ్ఛంద సంస్థలకు మునిసిపల్, మరియు పంచాయతీ అధికారులకు ఆదేశాలు జారీ చెయ్యాలని వారు కోరారు.

# పదవ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాల వద్ద కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు.

## -పదవ తరగతి పరీక్షా కేంద్రాలను తనిఖీ చేసిన జిల్లా ఎస్పీ అదిరాజ్ సింగ్ రాణా.

నంద్యాల జిల్లాలో నేటి నుంచి జరుగుతున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలు జరుగుతున్న సందర్భంగా నంద్యాల జిల్లా ఎస్పీ శ్రీ అదిరాజ్ సింగ్ రాణా నంద్యాల పట్టణ కేంద్రంలోని ఎస్ పి జి హై స్కూల్ పరీక్ష కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసి పరీక్షలు జరుగుచున్న విధానాన్ని పరీక్ష కేంద్రం వద్ద గల భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు.అనంతరం పరీక్షలు జరిగే తీరును అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. పరీక్ష కేంద్రాలు వద్ద విధుల్లో ఉన్న సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ వ్రాత పరీక్షలలో విద్యార్థులు కు ఎటువంటి ఆటంకాలు కలగకుండా ప్రశాంతంగా పరీక్షలు వ్రాసేల పరీక్ష కేంద్రాల వద్ద పటిష్ట పోలీసు బందోబస్తు విధులు నిర్వర్తించాలన్నారు.విద్యార్దులు నిర్దేశించిన సమయంలోపు కేంద్రాల లోనికి క్షుణ్ణంగా తనిఖీ చేసి అనుమతించాలన్నారు.సెల్ఫోన్లు,స్మార్ట్ వాచెస్,




ఎలక్ట్రానిక్ గాడ్జెట్స్ వంటి ఎలక్ట్రానిక్ పరికరాలను అనుమతికి వీల్లేదని అన్నారు.పరీక్షా కేంద్రాల చుట్టుపక్కల ఉండే జిరాక్స్, ఇంటర్నెట్ సెంటర్లు పరీక్షలు ముగిసిన వరకు తెరవడానికి వీలు లేకుండా చర్యలు చేపట్టాలని అన్నారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉన్నందున విద్యార్థులను, అక్కడ విధుల్లో ఉన్న సిబ్బంది మినహా ఇతరులను అనుమతించరాదని సూచించారు.సమస్యాత్మక పరీక్షా



కేంద్రాల వద్ద డ్రోన్ కెమెరాలతో నిఘా ఏర్పాటు చేయడం జరిగిందని తెలియజేశారు. పరీక్షలు పూర్తయ్యేవరకు అధికారులు మరియు సిబ్బంది అందరు అప్రమత్తంగా విధులు నిర్వర్తించాలని సూచించారు.మాస్ కాపీయింగ్,మాల్ ప్రాక్టీస్ వంటి జరగకుండా పరీక్ష నిర్వాహకులు,అధికారులు సమన్వయంతో పటిష్టంగా విధులు నిర్వహించి ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పరీక్ష కేంద్రాల వద్ద అప్రమత్తంగా బందోబస్తు విధులు నిర్వర్తించాలని పోలీసు అధికారులను సిబ్బందిని జిల్లా ఎస్పీ ఆదేశించారు.

# ప్రశాంత వాతావరణంలో పది పరీక్షలు.

ఆంధ్ర ప్రగతి మహానంది, మార్చి 17:




మహానంది మండలంలోని తిమ్మాపురం, గాజులపల్లె గ్రామాల్లోని ఆదర్శ,క్రీస్తుజ్యోతి, జడ్పీ పాఠశాలల్లో పదో తరగతి పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి.ఉదయం 8 గంటల నుండే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు చేరుకున్నారు. హాల్ టికెట్లను పరిశీలించిన అనంతరం పరీక్షా కేంద్రంలోనికి అనుమతించారు.పదవ తరగతి విద్యార్థిని, విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకుని వారికి కేటాయించిన సీట్లు చూసుకుని, పరీక్ష సమయానికి ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకున్నారు.పాఠశాల కేంద్రాల్లో ప్రతిష్ట పోలీస్ బందోబస్తు మధ్య ప్రశాంత వాతావరణంలో, పదో తరగతి పరీక్షలు జరుగుతున్నాయి.

ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక



## సీఎం చంద్రబాబును కలిసిన ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్.!


**-ఏఐ సాయంతో గుండె జబ్బులు నిర్ధారించే**
**సిర్కాడియావీ యాప్‌ను రూపొందించిన 14 ఏళ్ల సిద్ధార్థ్.**
**-సచివాలయానికి ఆహ్వానించి అభినందించిన సీఎం.**



ఆంధ్ర ప్రగతి అమరావతి, మార్చి 17 : సీఎం చంద్రబాబును ఎన్ఆర్ఐ విద్యార్థి సిద్ధార్థ్ నంద్యాల అనే బాలుడు కలిశాడు. ఏడు సెకెన్లలోనే గుండె జబ్బులు నిర్ధారించేందుకు ఏఐ సాయంతో సిర్కాడియావీ యాప్‌ను సిద్ధార్థ్ ఇటీవల రూపొందించారు. స్మార్ట్‌ఫోన్ ద్వారా గుంటూరు జీజీహెచ్‌లో రోగులకు పరీక్షలు కూడా నిర్వహించారు. విషయం తెలుసుకున్న సీఎం సిద్ధార్థ్‌ను కలిసేందుకు ఆహ్వానించారు. సిద్ధార్థ్ ప్రొఫైల్ తెలుసుకుని అభినందించారు. దాదాపు అరగంట పాటు అతనితో సీఎం ముచ్చటించారు. వైద్యం రంగంలో సేవలందించేలా ఆవిష్కరణలు చేయాలని ప్రపంచ వ్యాప్తంగా తెలుగుజాతి ఎక్కడున్నా అద్భుతాలు సృష్టించాలని తాను ఎప్పుడూ కలలు కంటుంటానని, వాటిని సిద్ధార్థ్‌లాంటి విద్యార్థులు సాధించిన విజయాలు తనకు ఎంతో సంతృప్తినిస్తాయని అన్నారు. ఏఐలో మరిన్ని ఆవిష్కరణలు చేయాలని సీఎం సూచించారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. సిద్ధార్థ్‌ను డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అభినందించారు. అనంతపురానికి చెందిన వీరి కుటుంబం 2010లో అమెరికాలో స్థిరపడింది. సీఎంను కలిసిన వారిలో సిద్ధార్థ్ తండ్రి మహేష్, ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ ఉన్నారు.

## త్రిభాషా విధానంలో తప్పేముంది? : సీఎం చంద్రబాబు

ఆంధ్ర ప్రగతి అమరావతి, మార్చి 17 :



అసెంబ్లీ సమావేశాల్లో జరిగిన లఘు చర్చలో 'స్వర్ణాంధ్ర విజన్-2047'లో భాగంగా రూపొందించిన నియోజకవర్గాల-2047 విజన్ డాక్యుమెంట్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ఆవిష్కరించి, ప్రజెంటేషన్ ఇచ్చారు. ఈ సందర్భంగా చంద్రబాబు, వివాదాస్పదంగా మారిన త్రిభాషా విధానం అంశంపై తమ వైఖరి వెల్లడించారు. త్రిభాషా విధానంలో తప్పేమీ లేదని అన్నారు. భాష అనేది కేవలం కమ్యూనికేషన్ కు మాత్రమేనని, భాష అనేది భావవ్యక్తీకరణ సాధనం అని వివరించారు. "ఇంగ్లీష్ మీడియంతో నాలెడ్జ్ వస్తుందని చెబుతున్నారు. కానీ, మాతృభాషలో చదువుకున్న వారే ప్రపంచ వ్యాప్తంగా రాణించారు. భాష ఏదైనా సరే, దాన్ని ద్వేషించడంలో అర్థం లేదు. మన విషయానికొస్తే... మన మాతృభాష తెలుగు, మనకు హిందీ జాతీయ భాష, అంతర్జాతీయ భాష ఇంగ్లీష్. మన వాళ్లు జపాన్, జర్మనీ, ఇతర దేశాలకు వెళుతున్నారు. అవసరమైతే ఆ భాషలను మనం నేర్చుకుంటే ఉద్యోగావకాశాలు ఇంకా పెరుగుతాయి. ఎన్ని భాషలు నేర్చుకుంటే అంత ఎక్కువ ఉపయోగం ఉంటుంది" అని చంద్రబాబు వివరించారు.
కాగా, త్రిభాషా విధానాన్ని తమిళనాడు వంటి దక్షిణాది రాష్ట్రాలు వ్యతిరేకిస్తున్న నేపథ్యంలో, ఏపీ సీఎం చంద్రబాబు చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

## 202 మండలాల్లో వడగాల్పుల హెచ్చరికలు

ఆంధ్ర ప్రగతి అమరావతి, మార్చి 17 :
ఈసారి భానుడు చెలరేగిపోతున్నాడు. వేసవి ప్రారంభానికి ముందే గుబులు పుట్టిస్తున్నాడు. మార్చి ముగియక ముందే ఉష్ణోగ్రత 42 డిగ్రీలు దాటేసింది. దీంతో బయటికి రావాలంటే జనం భయపడుతున్నారు. ముమ్ముందు ఎండలు మరింత మండిపోతాయని వాతావరణశాఖ అధికారులు చెబుతున్నారు. ఇక నేడు రాష్ట్రంలోని 202 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ ఎండీ కూర్మనాథ్ తెలిపారు. విజయనగరం జిల్లాలోని 15 మండలాలు, పార్వతీపురం మన్యంలో 12, శ్రీకాకుళంలో 8 మండలాల్లో తీవ్ర వడగాల్పులు ఉండే అవకాశం ఉందని పేర్కొన్నారు. అలాగే, పల్నాడు జిల్లాలో 19 మండలాలు, తూర్పుగోదావరిలో 19, అనకాపల్లిలో 16, శ్రీకాకుళంలో 16, కాకినాడలో 15, గుంటూరులో 14, ఏలూరులో 13, కృష్ణాలో 10, విజయనగరంలో 10, అల్లూరి సీతారామరాజు జిల్లాలో 9, డాక్టర్ బీఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 9, ఎన్టీఆర్ జిల్లాలో 8, పార్వతీపురం మన్యంలో 3, పశ్చిమ గోదావరిలో 3, విశాఖలో 2, బాపట్ల జిల్లాలో ఒక మండలంలో వడగాలులు వీస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని సూచించారు. నిన్న అనకాపల్లి జిల్లా నాతవరంలో అత్యధికంగా 42.1 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు కాగా, నంద్యాల జిల్లా రుద్రవరంలో 41.4 డిగ్రీలు, విజయనగరం జిల్లా పెదనందిపల్లిలో 41.8 డిగ్రీలు, ప్రకాశం జిల్లా గొల్లవిడిపి, కర్నూలు జిల్లా లద్దగిరిలో 41.4, పార్వతీపురం మన్యం జిల్లా పాచిపెంట, అయ్యప్పపేటలో 41 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

### తెలుగు వర్సిటీ పొట్టి శ్రీరాములు పేరుకు బదులుగా

# సురవరం ప్రతాపరెడ్డి పేరు

**పొట్టి శ్రీరాములు త్యాగాలను**
**ఎన్నటికీ మరువం**
**కొందరు ప్రజల్లో అపోహలు**
**కలిగించేలా కుట్రలు**
**ఇదివరకు పలు సంస్థలకు పేర్లను**
**మార్చిన సందర్భాలున్నాయి**
**అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి**



హైదరాబాద్,ఆంధ్ర ప్రగతి మార్చి 17 : తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరుకు బదులు.. సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడుతున్నామని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెలిపారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్పు బిల్లును మంత్రి దామోదర రాజనర్సింహ సభలో ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ.. తెలుగు విశ్వ విద్యాలయానికి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ సురవరం ప్రతాప్ రెడ్డిపేరు పెట్టాలని రాష్ట్ర గత శాసనసభ సమావేశాల్లో సభ దృష్టికి వచ్చిందన్నారు. ఈ మేరకు తెలుగు వర్సిటీకి పొట్టి శ్రీరాములు పేరును తొలగిస్తూ సురవరం ప్రతాపరెడ్డి పేరును పెడుతున్నట్లు చెప్పారు. పేరు మార్చినంత మాత్రాన పొట్టి శ్రీరాములు త్యాగాలను తక్కువగా చూడటం లేదన్నారు. ఆయన ప్రాణత్యాగాలను మనం స్మరించుకోవాలన్నారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ పేరు మార్చడం ఎవరికీ వ్యతిరేకం కాదని స్పష్టం చేశారు. పొట్టి శ్రీరాములు వర్సిటీ ఏపీలో కొనసాగుతోందన్నారు. తెలంగాణ వచ్చాక అనేక వర్సిటీలకు పేర్లు మార్చుకున్నామని చెప్పారు. తెలంగాణ కోసం పోరాటం చేసిన గొప్ప వ్యక్తులను స్మరించుకోవడం ఎంతో అవసరమన్నారు. తెలంగాణ వచ్చాక ఆర్టీసీ, పబ్లిక్ సర్వీస్ కమిషన్ పేర్లు మార్చుకున్నామని చెప్పారు. కొన్ని వర్సిటీలకు ప్రొఫెసర్ జయశంకర్, కొండా లక్ష్మణ్ బాపూజీ, పీవీ నరసింహారావు పేర్లు పెట్టుకున్నామని తెలిపారు. అదే ఒరవడిలో తెలుగు వర్సిటీ పేరును మారుస్తున్నామన్నామని స్పష్టం చేశారు. ప్రభుత్వ నిర్ణయం ఒక వ్యక్తి కోసమో.. ఒక కులం కోసమో కాదన్నారు. సురవరం ప్రతాప్‌రెడ్డి తెలంగాణకు గొప్ప సేవ చేశారని గుర్తు చేశారు. నిజాంకు వ్యతిరేకంగా సురవరం ప్రతాప్‌రెడ్డి పోరాడారని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. రాజకీయాలు కలుషితమయ్యాయో నాయకుల ఆలోచనలు కలుషితమయ్యాయో తెలియడం లేదన్నారు. పొట్టి శ్రీరాములు చేసిన కృషిని ఎవరూ తక్కువగా చూడటంలేదని.. వారి ప్రాణత్యాగాన్ని గుర్తించి అందరూ స్మరించుకోవాలన్నారు. పరిపాలనలో భాగంగా కొన్ని పాలనా పరమైన నిర్ణయాలు తీసుకున్నామని తెలిపారు. రాష్ట్ర ఏర్పాటుకు కృషి చేసిన వారిని స్మరించుకుని వారి పేర్లు పెట్టుకున్నామని చెప్పారు. రాష్ట్ర పునర్విభజన తరువాత గత పదేళ్లుగా ఈ ప్రక్రియ కొనసాగుతోందన్నారు. కొన్ని వర్గాలకు కొందరు అపోహలు కలిగించే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కేంద్ర పదవుల్లో ఉన్నవారు కూడా ఇలా చేయడం సమంజసం కాదన్నారు. ఎన్టీఆర్ హెల్త్ యూనివర్సిటీకి కాళోజీ పేరు పెట్టుకున్నామని.. ఇది ఎన్టీఆర్ ను అగౌరవపరిచినట్టు కాదు అని తెలిపారు. ఆచార్య ఎన్జీ రంగా వ్యవసాయ యూనివర్సిటీకి ప్రొఫెసర్ జయశంకర్ పేరు పెట్టుకున్నామని చెప్పారు. వైఎస్ పేరుతో ఉన్న హార్టికల్చర్ యూనివర్సిటీకి కొండా లక్ష్మణ్ బాపూజీ పేరు పెట్టుకున్నామన్నారు. వెంకటేశ్వర వెటర్నరీ యూనివర్సిటీకి పీవీ పేరును పెట్టుకున్నామన్నారు. ఇందులో భాగంగానే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి సురవరం ప్రతాప్ రెడ్డి పేరు పెట్టుకున్నామని చెప్పారు. ఏపీలో ఆ పాత పేర్లతో కొనసాగుతున్న యూనివర్సిటీలకు తెలంగాణలో పేర్లు మార్చుకున్నామన్నారు. ఒకే పేరుతో రెండు యూనివర్సిటీలు ఉంటే పరిపాలనలో గందరగోళం ఉంటుందన్నారు. అందుకే తెలంగాణ రాష్ట్రంలోని యూనివర్సిటీలకు, సంస్థలకు తెలంగాణ పేర్లు పెట్టుకుంటున్నామని వెల్లడించారు.

## అసెంబ్లీలో సెల్ ఫోన్ మాట్లాడరాదు

**సభ్యులకు డిప్యూటి స్పీకర్ రఘురామ సూచన**
**పిహెచ్‌సిలపై దృష్టి పెట్టామన్న మంత్రి సత్యకుమార్**



ఆంధ్ర ప్రగతి అమరావతి, మార్చి 17 : ఏపీ అసెంబ్లీ సమావేశాలు క్వశ్చన్ అవర్‌తో ప్రారంభం అయ్యాయి. నెల్లూరు జిల్లాలో నీటి సమస్య, పశు వైద్య కళాశాలపై క్వశ్చన్ అవర్‌లో చర్చ జరిగింది. అయితే అసెంబ్లీలో కొంతమంది సభ్యులు ఫోన్ మాట్లాడుతుండడంను డిప్యూటీ స్పీకర్ రఘురామ కృష్ణంరాజు గమించారు. అత్యవసర పరిస్థితి అయితే ఫోన్ బయటకు వెళ్లి మాట్లాడాలని, ఫోన్‌ను సభ్యులు సైలెంట్‌లో పెట్టుకోవాలని సూచించారు. ఇది విజ్ఞప్తి అని, విజ్ఞప్తులు ఒకటి రెండు సార్లు మాత్రమే ఉంటాయని డిప్యూటీ స్పీకర్ హెచ్చరించారు. అసెంబ్లీలో జామర్లు పెట్టాలని సభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు అనగా.. మన బలహీనత జామర్లపైకి నెట్టొద్దని డిప్యూటీ స్పీకర్ సమాధానం ఇచ్చారు. అసెంబ్లీలో పీహెచ్‌సీలపై వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ స్పందించారు. పీహెచ్‌సీల నిర్మాణంపై దృష్టి పెట్టామని, ప్రధానమంత్రి ఆయుష్మాన్ భారత్‌లో భాగంగా పీహెచ్‌సీల ఆధునికీకరణ జరుగుతుందన్నారు. వెంటనే ఉద్దానం కిడ్నీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో సరైన సౌకర్యాలు లేవని మంత్రి అచ్చెన్నాయుడు తెలిపారు. గత ప్రభుత్వం ఆర్భాటంగా ప్రారంభించి కనీస సౌకర్యాలు కూడా కిడ్నీ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్‌లో ఏర్పాటు చేయలేదని అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. ఈ విషయంలో మంత్రి సత్యకుమార్ దృష్టి పెట్టాలని కోరారు. గత ప్రభుత్వంలో రైతులు అనేక రకాల సమస్యలు ఎదుర్కొన్నారన్న సభ్యులు తెలిపారు. వ్యవసాయంలో ఎలాంటి ఆధునిక చర్యలు తీసుకుంటారనే అంశంపై సభ్యులు ప్రశ్నలు అడిగారు.

## అనకాపల్లిలో క్వారీ లారీ బీభత్సం

**పలు రైళ్ల రాకపోకలు తీవ్ర అంతరాయం**

అనకాపల్లి,,ఆంధ్ర ప్రగతి మార్చి 17 : ఆదివారం రాత్రి అనకాపల్లిలో క్వారీ లారీ సృష్టించిన బీభత్సం పలు రైళ్లు రాకపోకలను తీవ్ర ప్రభావితం చేసింది. విజయరామరాజు పేట అండర్ పాస్ దగ్గర లారీ అదుపు తప్పి ఐరన్ గడ్డర్‌ను ఢీ కొట్టింది. ప్రమాద ధాటికి రైల్వే ట్రాక్ అలైన్మెంట్ మారిపోయింది. దీంతో అదే సమయంలో బ్రిడ్జి దాటుతున్న గూడ్స్ రైలును చాకచక్యంగా లోకో పైలెట్ నిలిపివేయడంతో పెను ప్రమాదం తప్పింది. ట్రాక్ దెబ్బతినడం, గూడ్స్ రైలు నిలిచిపోవడంతో విశాఖ-విజయవాడ మార్గంలో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. విజయవాడ నుంచి విశాఖకు వెళ్లాల్సిన ప్యాసింజర్ రైళ్లు వివిధ స్టేషన్లలో నిలిచిపోయాయి. మరమ్మత్తులు పూర్తయి క్లియరెన్స్ వస్తే తప్ప ముందుకు కదిలే పరిస్థితి లేదు. దీంతో ప్యాసింజర్లు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఊహించని ఘటన రైల్వే వర్గాలను టెన్షన్ పెట్టాయి. హుటాహుటిన మరమ్మతు పనులు ప్రారంభమయ్యాయి. ఇటీవల కాలంలో అనకాపల్లి చుట్టూ పక్కల నుంచి పెద్ద ఎత్తున మైనింగ్ జరుగుతోంది. వివిధ ప్రాజెక్టుల కోసం వందల సంఖ్యలో క్వారీ లారీలు పని చేస్తున్నాయి. తరచూ వీటి వల్ల ప్రమాదాలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోంది.

## కోల్‌కతా హైకోర్టుకు వెళ్లవచ్చు

**అత్యాచార బాధితుల తల్లిదండ్రులకు సుప్రీంకోర్టు అనుమతి**



న్యూఢిల్లీ,ఆంధ్ర ప్రగతి మార్చి 17 : కోల్‌కతాలోని ఆర్జీ కర్ మెడికల్ కాలేజేలో అత్యాచారం, హత్యకు గురైన బాధితురాలి కేసులో మరింత లోతుగా దర్యాప్తు జరిపేందుకు సీబీఐని ఆదేశించాలని కోరుతూ ఆమె తల్లిదండ్రులు వేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టు ధర్మాసనం విచారించింది. దీనిపై దర్యాప్తు చేయించాలని కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించేందుకు పిటిషనర్లకు అత్యున్నత న్యాయస్థానం అనుమతి ఇచ్చింది. సీజేఐ సంజీవ్ ఖన్నా సారథ్యంలోని ధర్మాసనం ఈ ఆదేశాలు ఇచ్చింది. ఈ దశలో తిరిగి దర్యాప్తు జరపాల్సిందిగా సీబీఐని ఆదేశించలేమని పేర్కొంది. బాధితురాలి కుటుంబ సభ్యుల తరఫున సీనియర్ అడ్వకేట్ కరుణ నుండి హాజరుకాగా, సీబీఐ తరఫున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా హాజరయ్యారు. మెడికో హత్యాచారం కేసులో ప్రధాన నిందితుడు సంజయ్ రాయ్‌కు జనవరి 20న సీల్దా సెషన్స్ కోర్టు జీవిత ఖైదు విధించింది. అయితే మరికొందరి పాత్రను నిర్ధారించేందుకు సీబీఐ మరింత లోతైన దర్యాప్తు జరపాలని బాధితురాలి తల్లిదండ్రులు కోరుతున్నారు. ఈమేరకు సీబీఐను ఆదేశించాల్సిందిగా వారు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. అయితే సీబీఐ తరఫు న్యాయవాది వాదన విన్న అనంతరం కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించడం సముచితమని సుప్రీం ధర్మాసనం భావించింది. కాగా, హత్యాచార బాధితురాలి న్యాయం జరగాలని కోరుతూ ఈనెల మొదట్లో రెండు ర్యాలీలు కోల్‌కతాలో జరిగాయి. హత్యాచార ఘటన జరిగిన ఏడు నెలలైన సందర్భంగా ఈ ఘటనను ఖండిస్తూ పౌర సమాజాలు ర్యాలీలు చేపట్టారు. మార్చి 1న విద్యాశాఖ మంత్రి బ్రత్య బసు వాహనం ఢీకొనడంతో జాదవ్‌పూర్ క్యాంపస్ స్టూడెంట్ గాయపడిన ఘటనపై కూడా వీరు నిరసన తెలిపారు. ఆర్జీ కర్ మెడికో హత్యాచార ఘటనలో నిందితులందరినీ అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. సంజీవ్ రాయ్‌కు జీవితాంతం జైలులోనే ఉండాలని సీల్దా కోర్టు శిక్ష విధించగా, ఈ నేరంలో ప్రత్యక్షంగా కానీ పరోక్షంగా కానీ మరో ముగ్గురి ప్రమేయం ఉందని, వారిని కూడా అరెస్టు చేయాలని బాధితురాలి తల్లిదండ్రులు డిమాండ్ చేస్తున్నారు. తొలుత ఈ కేసుపై కోల్‌కతా పోలీసులు దర్యాప్తు చేపట్టగా ఆ తర్వాత కేసు దర్యాప్తును సీబీఐకి అప్పగించారు.

### రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా నేషనల్

## ఇంటెలిజెన్స్ డైరెక్టర్ సమావేశం



న్యూఢిల్లీ,ఆంధ్ర ప్రగతి మార్చి 17 : కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో అమెరికా నేషనల్ ఇంటెలిజెన్స్ డైరెక్టర్ తులసి గబ్బర్డ్ సోమవారం సమావేశమయ్యిరు. ఈ సమావేశంలో ఇరుదేశాల మధ్య రక్షణ, భద్రతా సహకారం బలోపేతంపై చర్చించారు. ఒక రక్షణ ఒప్పందపైన కూడా చర్చలు జరిగినట్టు తెలుస్తోంది. తులసి గబ్బర్డ్‌తో సమావేశమైన విషయాన్ని సామాజిక మాధ్యం 'ఎక్స్'లో రాజ్‌నాథ్ సింగ్ షేర్ చేశారు. రక్షణ, సమాచార షేరింగ్‌తో పాటు, ఇండియా-యూఎస్ భాగస్వామ్యాన్ని మరింత బలోపేతం చేసేందుకు సమావేశంలో ఉభయులూ చర్చించినట్టు చెప్పారు. ట్రంప్ రెండో విడత కార్యవర్గంలోని సీనియర్ స్థాయి అధికారి భారత్ పర్యటించడం ఇది మొదటిసారి. రెండున్నర రోజుల పర్యటనలో భాగంగా ఆదివారంనాడు న్యూఢిల్లీకి వచ్చిన ఆమె గ్లోబల్ ఇంటెలిజెన్స్ కాంక్లేవ్‌లూ కూడా పాల్గొన్నారు. జాతీయ భద్రతా సలహాదారు అజిత్ డోబల్‌తోనూ ఆదివారం సాయంత్రం గబ్బర్డ్ సమావేశమయ్యారు. భారత్, అమెరికా మధ్య భద్రతారంగంలో బంధాన్ని బలోపేతం చేసుకోవడంతో ఉభయులూ చర్చించారు. ఇండో-పసిఫిక్, ఖలిస్థానీ ఉగ్రవాదం వంటి అంశాలు కూడా చర్చించినట్టు సమాచారం.

## నటి రన్యారావుపై బీజేపీ వివాదాస్పద వ్యాఖ్యలు

**ఆమె స్మగ్లింగ్ వ్యవహారంలో మంత్రుల ప్రమేయం ఉంది**





న్యూఢిల్లీ,ఆంధ్ర ప్రగతి మార్చి 17 : :బంగారం స్మగ్లింగ్ కేసులో అరెస్టయిన కన్నడ నటి రన్యారావుపై బీజేపీ ఎమ్మెల్యే వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. ఆమె ప్రైవేట్ భాగాల్లో బంగారం దాచి స్మగ్లింగ్ చేసిందంటూ హాట్ కామెంట్స్ చేశారు. అంతేకాకుండా బంగారం స్మగ్లింగ్ వ్యవహారంలో రాష్ట్ర మంత్రుల ప్రమేయం కూడా ఉందని ఆయన సంచలన ఆరోపణలు చేశారు. బీజాపూర్ సిటీ ఎమ్మెల్యే బసంగౌడ పాటిల్ యత్నాల్ మాట్లాడుతూ.. 'ఆమె (రన్యారావు) తన శరీరమంతా బంగారంతో కప్పేసింది. తన ప్రైవేట్ భాగాల్లో బంగారం దాచి స్మగ్లింగ్ చేసింది. ఈ కేసులో రాష్ట్రానికి చెందిన కొందరు మంత్రుల ప్రమేయం ఉంది. అందుకు సంబంధించిన పూర్తి సమాచారాన్ని సేకరించాను. రన్యారావుకు ఎయిర్‌పోర్ట్‌లో ఎవరు సహకరించారు, బంగారం ఎలా తీసుకొచ్చారు వంటి విషయాలన్నీ శాసనసభ సమావేశాల్లో బహిర్గతం చేస్తాను. ఈ వ్యవహారంతో ప్రమేయం ఉన్న మంత్రుల బండారం కూడా బయటపెడతాను' అంటూ హాట్ కామెంట్స్ చేశారు. రన్యారావు దుబాయ్ నుంచి రూ.14 కోట్లకు పైగా విలువైన బంగారం స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరు విమానాశ్రయంలో పట్టుబడిన విషయం తెలిసిందే. ఆమెను అరెస్ట్ చేసిన అనంతరం డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) అధికారులు లావెల్లె రోడ్‌లోని ఆమె ఇంటిలో సోదాలు నిర్వహించగా రూ.2.06 కోట్ల విలువైన బంగారు నగలు, రూ.2.67 కోట్ల నగదు పట్టుబడ్డాయి. దీంతో పట్టుబడిన మొత్తం నగదు, బంగారం విలువ 17.29 కోట్లుగా అధికారులు నిర్ధారించారు. ప్రస్తుతం ఆమె బెంగళూరులోని పరప్పన అగ్రహార జైలులో ఉన్నారు. అయితే, తాను ఏతప్పూ చేయలేదని.. తప్పుడు కేసులో ఇరికించారంటూ పేర్కొన్నారు. తనను విమానంలోనే అరెస్ట్ చేసినట్లు చెప్పారు. వివరణ ఇవ్వడానికి కూడా అధికారులు అవకాశం ఇవ్వలేదని ఆరోపించారు.


ప్రతి అక్షరం ప్రజాహితం
ఆంధ్రప్రగతి
తెలుగు దినపత్రిక


# ఛాంపియన్స్ ట్రోఫీతో పాక్‌కు
# రూ. 740 కోట్లు తీవ్ర నష్టం

2025 ఛాంపియన్స్ ట్రోఫీ వల్ల పాకిస్థాన్?కు కోలుకోలేని దెబ్బ తగిలింది. ఈ టోర్నీకి ఆతిథ్యం ఇచ్చిన పాక్? ఆర్థికంగా భారీగా నష్టపోయినట్లు తెలుస్తోంది. టోర్నమెంట్ నిర్వాహణతో పాకిస్థాన్ క్రికెట్ బోర్డు దాదాపు రూ. 740 కోట్లు నష్టపోయినట్లు కథనాలు వస్తున్నాయి. దీంతో నష్టాన్ని పూడ్చుకోవడానికి బోర్డు సతమతమవుతోంది. ఆటగాళ్ల ఫీజులు తగ్గించే ఆలోచన చేస్తున్నట్లు అక్కడి మీడియా పేర్కొంది. దాదాపు 29 ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నమెంట్? ఆతిథ్య హక్కులు దక్కించుకున్న పాకిస్థాన్ స్టేడియాల రెనొవేషన్ పనులపై దృష్టి పెట్టింది. ఇందులో భాగంగానే 58 మిలియన్ డాలర్లను రావల్పిండి, లాహోర్, కరాచీ స్టేడియాల ఆధునీకరణ పనుల కోసం వెచ్చించింది. ఇక ఈవెంట్ సన్నాహాల కోసం మరో 40 మిలియన్ డాలర్లు ఖర్చు చేసింది. అంటే దాదాపు 98 మిలియన్ డాలర్ల ఖర్చు అయ్యింది! అయితే హోస్టింగ్ ఫీజు కింద పీసీబీకి 6 మిలియన్ డాలర్లే అందినట్లు తెలుస్తోంది. మరోవైపు టికెట్ విక్రయాలు, స్పాన్సర్?షిప్?లు కూడా అంతంత మాత్రంగానే వచ్చాయి. దీంతో పీసీబీకి దాదాపు 85 మిలియన్ డాలర్లు నష్టం వాటిల్లినట్లు సమాచారం. ఇది పీసీబీకి కోలుకోలేని దెబ్బ అనే చెప్పుకోవాలి. పీసీబీ ఇంతటి భారీ నష్టాన్ని పూడ్చుకునే ప్రయత్నాలు చేస్తోంది. ఇందులో భాగంగానే ఆటగాళ్ల ఫీజుల్లో కోత విధించాలని డిసైడ్ అయ్యిందట. ఆటగాళ్ల మ్యాచ్ ఫీజును రూ.40 వేల నుంచి రూ.10 వేలకు పీసీబీ ఎలాంటి అధికారిక సమాచారం లేకుండా తగ్గించినట్లు అక్కడి మీడియా పేర్కొంది. అలాగే ఆటగాళ్లకు 5 స్టార్ హోటల్ వసతులను కూడా తగ్గించి, ఎకానమీ హోటళ్లతో సర్దుకోవాలని బోర్డు సూచించినట్లు సమాచారం.దాదాపు 29ఏళ్ల తర్వాత ఐసీసీ టోర్నమెంట్?కు ఆతిథ్య హక్కులు దక్కించుకుంటే స్వదేశంలో పాక్ ఆడింది ఒక్క మ్యాచ్ మాత్రమే. అందులోనూ పాకిస్థాన్ ఓడింది. హైబ్రిడ్ మోడల్? వల్ల భారత్?తో మ్యాచ్? దుబాయ్?లో ఆడగా, బంగ్లాదేశ్?తో జరగాల్సిన మూడో మ్యాచ్? వర్షం కారణంగా రద్దైంది. దీంతో ఒక్క విజయం సాధించకుండానే పాక్ టోర్నీ నుంచి నిష్క్రమించింది.

# ముంబయి ఇండియన్స్ ప్లేయర్‌కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) నోటీసులు...

ముంబయి ఇండియన్స్ (ఎంఐ) ఆల్ రౌండర్ కార్బిన్ బోష్ కు పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) తాజాగా లీగల్ నోటీసులు జారీ చేసింది. ముందుగా పాకిస్థాన్ సూపర్ లీగ్ (పీఎస్ఎల్)లో ఆడేందుకు అంగీకరించి, హఠాత్తుగా ఐపీఎల్ లో ఎంఐతో ఒప్పందం చేసుకోవడమే అందుకు కారణం. దక్షిణాఫ్రికాకు చెందిన బోష్ ఈ ఏడాది పాకిస్థాన్ మీదే తన అంతర్జాతీయ అరంగేట్రం చేశాడు. ఆ సిరీస్‌లో సత్తా చాటడం వల్ల అతడిని పీఎస్ఎల్ ఫ్రాంఛైజీ పెషావర్ జల్మి తమ జట్టులోకి తీసుకుంది. జనవరి 13న లాహోర్‌లో జరిగిన పీఎస్ఎల్ ప్లేయర్స్ డ్రాఫ్ట్ పదో ఎడిషన్ సందర్భంగా ఆ ఫ్రాంఛైజీ బోష్ ను కొనుగోలు చేసింది. అయితే, గతేడాది జరిగిన ఐపీఎల్ మెగా వేలంలో తాము కొన్న దక్షిణాఫ్రికా పేసర్ లిజాడ్ విలియమ్స్ గాయపడడం వల్ల ముంబయి ఇండియన్స్ అతడి స్థానాన్ని బోష్ తో భర్తీ చేసుకుంది. అయితే బోష్ ముందు పీఎస్ఎల్ ఫ్రాంఛైజీతో ఒప్పందం చేసుకుని, ఇప్పుడు ముంబయి జట్టుకు మారడంపై పీసీబీ ఆగ్రహం వ్యక్తం చేసింది. ఈ క్రమంలో అతనికి లీగల్ నోటీసులు పంపింది. లీగ్ నుంచి నిష్క్రమించడం వల్ల ఎదురయ్యే పరిణామాలను బోష్ కు వివరించింది. ఈ విషయంపై వివరణ ఇవ్వాలని కోరింది.






# ఆరో టైటిల్ కోసం సిద్ధమౌతున్న చెన్నై

ఐపీఎల్ 2025 సీజన్ 18 మార్చ్ 22 నుంచి ప్రారంభం కానుంది. ఈసారి అన్ని జట్లు సమూల మార్పులతో బరిలో దిగుతున్నాయి. చాలా జట్లకు సారథులు కూడా మారిపోయారు. గత సీజన్‌లో గ్రూప్ దశకే పరిమితమైన చెన్నై సూపర్ కింగ్స్ ఈసారి అదరగొట్టేందుకు ప్లేయింగ్ 11 సిద్ధం చేస్తోంది. ఐపీఎల్‌లో ఇప్పటి వరకూ ఐదు సార్లు టైటిల్ సాధించిన సీఎస్కే ఆరవ టైటిల్ కోసం అన్ని అస్త్రాల్ని సిద్ధం చేస్తోంది. ఈసారి సీఎస్కే జట్టులో సామ్ కుర్రాన్, డెవాన్ కాన్వే, రవిచంద్రన్ అశ్విన్, మహీంద్ర సింగ్ ధోని, రచిన్ రవీంద్ర, రుతురాజ్ గైక్వాడ్, శివమ్ దూబె టీమ్ పటిష్టమైన బ్యాటింగ్ లైనప్‌తో ఉంది. ఇక బౌలింగ్ విభాగంలో పతిరానా, నాథన్ ఎల్లిస్, నూర్ అహ్మద్ వంటి ఆటగాళ్లతో బలంగా ఉంది. ఈసారి చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్‌ను రుతురాజ్ గైక్వాడ్ – డెవాన్ కాన్వే ప్రారంభించవచ్చని తెలుస్తోంది. లేదా డెవాన్ కాన్వే–రచిన్ రవీంద్ర ఓపెనర్లుగా దిగే అవకాశాలు కూడా ఉన్నాయి. ఇక దీపక్ హుడా, రాహుల్ త్రిపాఠి, విజయ్ శంకర్ మిడిల్ ఆర్డర్ పటిష్టంగా ఉంటుంది. ఆల్ రౌండర్ కోటాలో శివమ్ దూబే, సామ్ కుర్రాన్, రవీంద్ర జజేజాలకు తిరుగులేదని చెప్పవచ్చు. ఇక పేసర్లుగా మతీషా పతిరానా, అన్షుల్ కాంబోజ్ ఉంటే స్పిన్నర్‌గా అశ్విన్ కీలకం కానున్నాడు. మహీంద్ర సింగ్ ధోనీ కెప్టెన్ కాకపోయినా అంతా అతని కన్నుసన్నల్లోనే నడవనుంది.

# బీసీసీఐ 'ఫ్యామిలీ మెంబర్స్' రూల్ పట్ల కోహ్లీ అసంతృప్తి!



క్రికెటర్లు విదేశీ పర్యటనలో వారి వెంట కుటుంబ సభ్యులను తీసుకెళ్లకూడదని బీసీసీఐ నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. ఈ నిర్ణయాన్ని విరాట్ కోహ్లీ తీవ్రంగా తప్పుబట్టారు. మ్యాచ్ ఆడే సమయంలో క్రీడాకారులు చాలా ఒత్తిడితో ఉంటారని, ఆ సమయంలో వారికి మద్దతుగా కుటుంబ సభ్యులు ఉండటంలో తప్పులేదని కోహ్లీ పేర్కొన్నారు. కుటుంబ సభ్యులు తోడుగా ఉంటే ఒత్తిడిని అధిగమించి చురుగ్గా ఆడతారని అన్నారు. ఒత్తిడిలో ఉన్న క్రీడాకారులు స్థిరత్వంలో ఉండటం కోసం కుటుంబ సభ్యుల తోడు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఇప్పుడు కోహ్లీ వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమాల్లో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. క్రికెట్ అభిమానులు, క్రికెటర్లు కోహ్లీకి మద్దతుగా నిలుస్తున్నారు. కోహ్లీ వ్యాఖ్యలకు అనుకూలంగా పోస్టులు పెడుతున్నారు. కోహ్లీ వ్యాఖ్యలకు పెద్ద ఎత్తున మద్దతు లభిస్తున్న నేపథ్యంలో బీసీసీఐ తన నిర్ణయాన్ని వెనక్కు తీసుకుంటుందా లేదా అనేది ఇప్పుడు చర్చనీయాంశంగా ఉంది.

# హైదరాబాద్‌లో ఆపిల్ ఎయిర్‌పాడ్‌ల ఉత్పత్తి !




ఐఫోన్ల తయారీ కంపెనీ ఆపిల్ హైదరాబాద్‌లోఉన్న ఫాక్స్‌కాన్ ప్లాంట నుంచి ఎయిర్‌పాడ్‌ల ఉత్పత్తిని ప్రారంభించనుంది. ఈ ఏప్రిల్‌లో వీటి ఉత్పత్తి ప్రారంభించి, అంతర్జాతీయ మార్కెట్లకు ఎగుమతి చేయనుంది. భారత్ నుంచి ఐఫోన్ల తరువాత యాపిల్ చేస్తున్న రెండో ఉత్పత్తి ఎయిర్‌పాడ్స్. ప్రస్తుతం ఎయిర్‌పాడ్‌ల ఉత్పత్తి కేవలం ఎగుమతుల కోసమే చేస్తున్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి.2023 ఆగస్టులో ఫాక్స్‌కాన్ 3,500 కోట్లతో హైదరాబాద్‌లో ఎయిర్‌పాడ్‌ల ఉత్పత్తి ప్లాంట్ నిర్మాణానికి అనుమతులు పొందింది. ట్రూ వైర్‌లెస్ డివైజ్‌ల ఉత్పత్తిలో ఆపిల్ ప్రపంచ మార్కెట్ లీడర్‌గా ఉంది. 2024లో ఆపిల్‌కు ఈ విభాగంలో 23.1 శాతం మార్కెట్ వాటా కలిగి ఉంది. రెండో స్థానంలో ఉన్న శాంసంగ్‌కు 8.5 శాతం మార్కెట్ వాటా ఉంది.అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమెరికాలోకి వచ్చే దిగుమతులపై ప్రతీకార సుంకాలు విధిస్తామని ప్రకటించడంతో ఇండియాలో కూడా ఆపిల్ తన ఉత్పత్తిని తగ్గించుకోవచ్చని వార్తలు వచ్చాయి. వచ్చే నాలుగు సంవత్సరాల్లో అమెరికాలో 500 బిలియన్ డాలర్ల పెట్టుబడులు పెట్టనున్నట్లు యాపిల్ ప్రకటించింది.ఈ కారణంతో కూడా బయటి దేశాల్లో ఉత్పత్తిని తగ్గించవచ్చని భావించారు. అయితే ముందు అనుకున్న విధంగానే ఇండియా ప్లాంట్ నుంచి ఎయిర్‌పాడ్‌ల ఉత్పత్తి, ఎగుమతులను కంపెనీ ప్రారంభించనుంది. ఇండియా సెల్యులార్ అండ్ ఎలక్ట్రానిక్స్ అసోసియేషన్ (ఐసీఈఏ) తెలిపిన వివరాల ప్రకారం హియర్‌బుల్స్, వేరబుల్స్‌పై భారత్ 20 శాతం దిగుమతి సుంకాలు విధిస్తోంది.

# పెరగనున్న వాహనాల ధరలు




%దేశంలో ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి, వాహన కొనుగోలు దారులకు షాక్ ఇచ్చే వార్తను తెలిపింది. ఈ క్రమంలో ఏప్రిల్ 2025 నుంచి తమ వాహనాల ధరలను పెంచుతున్నట్లు సోమవారం అధికారికంగా ప్రకటించింది. భారతదేశంలో అతిపెద్ద ప్యాసింజర్ కార్ల తయారీ సంస్థ మారుతి సుజుకి సోమవారం కీలక ప్రకటన చేసింది. ఈ క్రమంలో తన వాహనాల ధరలను ఏప్రిల్ 2025 నుంచి పెంచుతున్నట్లు తెలిపింది. పెరుగుతున్న ఖర్చుల నేపథ్యంలో ధరల పెంపు తీసుకున్నామని, ఇది మోడళ్ల తీరును బట్టి మారుతుందని ఆటోమొబైల్ సంస్థ వెల్లడించింది. మారుతి సుజుకి ఇండియా మార్చి 17న రెగ్యులేటరీ ఫైలింగ్‌లో ఈ విషయాన్ని ప్రకటించింది. ధరల పెంపు ప్రకటన తర్వాత మారుతి సుజుకి షేర్ల ధర దాదాపు 2% పుంజుకుంది.

మారుతి సుజుకి ఫిబ్రవరి 2025లో మొత్తం 199,400 యూనిట్ల వాహనాలను విక్రయించింది. గత సంవత్సరం ఇదే నెలలో అమ్ముడైన 197,471 యూనిట్ల నుంచి 0.97% స్వల్ప వృద్ధిని నమోదు చేసింది. ఫిబ్రవరి 2025లో మొత్తం అమ్మకాలలో దేశీయ అమ్మకాలు 163,501 యూనిట్లు, ఇతర %ాజువీ%లవి 10,878 యూనిట్ల అమ్మకాలు, 25,021 యూనిట్ల ఎగుమతులు ఉన్నాయి. ఈ క్రమంలో ఎగుమతులు సంవత్సరానికి 13.5% తగ్గుదల ను నమోదు చేశాయి.

మారుతి సుజుకి షేర్ ధర ఒక నెలలో 9% కంటే ఎక్కువ పడిపోయింది. మారుతి సుజుకి షేర్లు ఆరు నెలల్లో 5.2% పడిపోగా, ఒక సంవత్సరం కాలంలో 1% స్వల్పంగా పెరిగాయి. కానీ తాజాగా ఈ స్టాక్ ధర పుంజుకుంది. గత రెండు సంవత్సరాలలో మారుతి సుజుకి స్టాక్ ధర 40% ర్యాలీ చేసింది. ఇదే క్రమంలో ఈ కంపెనీ స్టాక్ ఐదు సంవత్సరాలలో 107% మల్టీబ్యాగర్ రాబడిని అందించడం విశేషం.

అయితే తమ కస్టమర్లపై ప్రభావాన్ని తగ్గించడానికి కంపెనీ నిరంతరం కృషి చేస్తుందని, పెరిగిన ఖర్చులో కొంత భాగాన్ని మార్కెట్‌కు బదిలీ చేయాల్సి వస్తుందని కంపెనీ వెల్లడించింది. మారుతి సుజుకి మొత్తం దేశీయ ప్యాసింజర్ వెహికల్ (%ూఎ%) అమ్మకాలు గత నెలలో 0.32% పెరిగి 160,791 యూనిట్లకు చేరుకున్నాయి. వచ్చే నెల నుంచి ఈ కంపెనీ వాహనాల ధరలు పెరిగనున్న నేపథ్యంలో మిగతా సంస్థలు కూడా ఇదే ధోరణి కొనసాగించే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.




# ఆండ్రాయిడ్ 11 ఫోన్లకు సపోర్ట్ నిలిపివేసిన యోనో యాప్

భారతీయ స్టేట్ బ్యాంక్ వినియోగదారులకు ముఖ్యమైన అలర్ట్ వెలువడింది. ఎస్‌బీఐ యోనో మొబైల్ యాప్ ఇకపై ఆండ్రాయిడ్ 11 మరియు అంతకంటే ముందు వెర్షన్లలో పనిచేయదని బ్యాంక్ స్పష్టం చేసింది. భద్రత, యాప్ పనితీరు మెరుగుపరచడానికి ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఎస్‌బీఐ తెలిపింది. ఆండ్రాయిడ్ పాత వెర్షన్లలో భద్రతాపరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉండటంతో, వినియోగదారుల డేటాను సురక్షితంగా ఉంచడానికి ఈ మార్పు అవసరమని భావిస్తున్నట్టు వెల్లడించింది. చాలామంది వినియోగదారులు పాత ఆండ్రాయిడ్ వెర్షన్లలో యోనో యాప్ ఉపయోగించడంలో సమస్యలు ఎదుర్కొంటున్నారని ఫిర్యాదులు చేశారు. ప్లే స్టోర్ సమీక్షలలో కూడా ఈ సమస్యను గురించి ప్రస్తావించారు. తమ ఆండ్రాయిడ్ ఫోన్లలో యాప్ పనిచేయడం లేదని కొందరు వినియోగదారులు తెలిపారు. ఈ నేపథ్యంలోనే ఎస్‌బీఐ కీలక నిర్ణయం తీసుకుంది. కాగా, ఆండ్రాయిడ్ 11 మరియు అంతకంటే ముందు వెర్షన్లలో పనిచేసే శాంసంగ్ గెలాక్సీ ఎస్21 అల్ట్రా, శాంసంగ్ గెలాక్సీ ఎస్20 5జీ, గూగుల్ పిక్సెల్ 4, శాంసంగ్ గెలాక్సీ నోట్ 20 అల్ట్రా 5జీ, వన్ ప్లస్ 8 ప్రో, వన్ ప్లస్ 9 ప్రో, పోకో ఎక్స్3 ప్రో ఫోన్లలో ఇకపై యోనో యాప్ ను యాక్సెస్ చేయలేరు. యూజర్లు తమ ఫోన్ ఆపరేటింగ్ సిస్టమ్‌ను అప్‌డేట్ చేసుకోవాలని లేదా కొత్త వెర్షన్‌కు మద్దతు ఇచ్చే ఫోన్లను ఉపయోగించాలని ఎస్‌బీఐ సూచించింది.

# స్వల్పంగా తగ్గిన పసిడి ధర..



రోజురోజుకూ పెరుగుతూ పోతున్న పసిడి ధరలు దిగొస్తున్నాయి. రెండు రోజులుగా స్వల్పంగా ధరలు తగ్గాయి. ఆదివారంతో పోలిస్తే సోమవారం ఉదయం 24 క్యారెట్ల గోల్డ్ ధర రూ.89,560 కి చేరింది. హైదరాబాద్ లో 22 క్యారెట్ల బంగారం ధర పది గ్రాములు రూ. 82,100 గా ఉంది. ఆదివారంతో పోలిస్తే ఇది రూ.100 తక్కువ. ఇక కిలో వెండి ధర రూ.1,11,900 గా ఉంది. తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన నగరాలలో బంగారం రేట్లు ఎలా ఉన్నాయంటే.. హైదరబాద్‌లో పది గ్రాముల 22 క్యారెట్ల బంగారం ధర రూ.82,100 ఉండగా, 24 క్యారెట్ల బంగారం ధర రూ.89,560 లుగా ఉంది. విజయవాడలో 22 క్యారెట్ల బంగారం ధర రూ.82,100, 24 క్యారెట్ల బంగారం ధర రూ.89,560 ఉందని వ్యాపారులు చెబుతున్నారు.

# 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'

## ఆకట్టుకుంటున్న టీజర్..!




కల్యాణ్ రామ్ హీరోగా కొత్త దర్శకుడు ప్రదీప్ చిలుకూరి తెరకెక్కిస్తున్న తాజా చిత్రం 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి'. లేడీ సూపర్ స్టార్ విజయశాంతి ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. కల్యాణ్ రామ్ సరసన కథానాయికగా సాయి మంజ్రేకర్ చేస్తున్నారు. ఇప్పటికే రిలీజైన ప్రచార చిత్రాలు, టైటిల్ పోస్టర్, ఇటీవల వదిలిన ప్రీ-టీజర్ ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ క్రమంలో తాజాగా మేకర్స్ టీజర్‌ను విడుదల చేశారు. హైవోల్టేజ్ యాక్షన్ సీన్స్, ఎమోషనల్ మూమెంట్స్ కలబోసిన ఈ టీజర్ ఆకట్టుకుంటోంది. అజనీశ్ లోకనాథ్ బ్యాగ్రౌండ్ స్కోర్ ఈ టీజర్ లో హైలైట్ గా నిలిచింది. విజువల్స్ కూడా ప్రత్యేక ఆకర్షణ అని చెప్పాలి. ఇక టీజర్‌లో విజయశాంతి వైజయంతి అనే పవర్ ఫుల్ పోలీసాఫీసర్ గా కనిపించగా.. ఆమె కొడుకు పాత్రలో కల్యాణ్ రామ్ కనిపించారు. నెక్స్ట్ పుట్టినరోజు నాటికి పోలీస్ గా ఖాకీ డ్రెస్ లో చూడాలని వైజయంతి తన కుమారుడిని కోరుతుంది. అయితే, కొన్ని అనుకోని పరిస్థితుల్లో పోలీస్ అవ్వాల్సిన హీరో... కత్తి పట్టుకొని రౌడీల మీద యుద్ధానికి బయలుదేరినట్లు టీజర్‌లో చూపించారు. కాగా, తల్లీ కొడుకుల మధ్య ప్రేమ, వైరం, సెంటిమెంట్ నేపథ్యంలో 'అర్జున్ సన్నాఫ్ వైజయంతి' సినిమా రూపొందినట్లు టీజర్ చూస్తే అర్థమవుతోంది. అశోక క్రియేషన్స్, ఎన్టీఆర్ ఆర్ట్స్ బ్యానర్స్ పై అశోక్ వర్ధన్ ముప్పా, సునీల్ బలుసు నిర్మించిన ఈ చిత్రంలో బాలీవుడ్ నటుడు సోహైల్ ఖాన్ ప్రతినాయకుడిగా నటించారు. శ్రీకాంత్ మేక, బబ్లూ పృథ్వీరాజ్ ఇతర కీలక పాత్రల్లో కనిపించనున్నారు.

## స్వాతంత్ర్య తిరుగుబాటు నేపథ్యంలో

# సంబరాల ఏటి గట్టు



గత కొంతకాలంగా మెగా మేనల్లుడు సాయి దుర్గ తేజ్ కెరీర్ ఆశాజనకంగా లేదు. అనుకోకుండా అతనికి యాక్సిడెంట్ అవడం, దాంతో సినిమాల నుంచి లాంగ్ గ్యాప్ రావడం జరిగాయి. ఆ తర్వాత రిలీజైన విరూపాక్ష మంచి సక్సెస్ అయింది. విరూపాక్ష తర్వాత మేనమామ పవన్ కళ్యాణ్ తో బ్రో సినిమా చేస్తే అది అనుకున్న స్థాయిలో ఆడియన్స్ ను ఆకట్టుకోలేకపోయింది. బ్రో తర్వాత సాయి తేజ్ సినిమాల నుంచి కాస్త గ్యాప్ తీసుకుని తన ఆరోగ్యాన్ని సెట్ చేసుకుని వచ్చాడు. రోహిత్ కేపీ అనే కొత్త దర్శకుడు చెప్పిన కథకు తేజ్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చి ఆ సినిమాను సెట్స్ పైకి తీసుకెళ్లాడు. సంబరాల ఏటి గట్టు టైటిల్ తో రూపొందుతున్న ఈ భారీ పాన్ ఇండియన్ యాక్షన్ డ్రామా తేజ్ కెరీర్లోనే భారీ బడ్జెట్ తో తెరకెక్కుతుంది. ! సుమారు రూ.100 కోట్ల బడ్జెట్ తో నిరంజన్ రెడ్డి, చైతన్య రెడ్డి ఈ సినిమాను ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్నారు. రీసెంట్ గా ఈ సినిమా నుంచి రిలీజైన టీజర్ చూశాక సినిమా రాయలసీమ ప్రాంతంలో జరిగే కథగా అర్థమైంది. ఇదిలా ఉంటే సంబరాల ఏటి గట్టు గురించి ఇప్పుడు ఫిల్మ్ నగర్ సర్కిల్స్ లో ఓ బజ్ వినిపిస్తోంది. ఈ సినిమా కథాంశం దేశ స్వాతంత్ర్య తిరుగుబాటు పై ఉంటుందని, బ్రిటీష్ వారిపై తిరుగుబాటు చేసి రాయలసీమ ఏరియాలో కరువును అంతం చేసిన వీరుడి కథగా తెరకెక్కుతుందని తెలుస్తోంది. మలయాళ నటి ఐశ్వర్యా లక్ష్మి హీరోయిన్ గా నటిస్తున్న ఈ సినిమాకు కాంతార ఫేమ్ అజనీష్ లోకనాథ్ సంగీతం అందిస్తున్నారు. సెప్టెంబర్ 25న సంబరాల ఏటి గట్టు రిలీజ్ కానుంది. ఈ సినిమా కోసం సాయి తేజ్ ఎంతో కష్టపడటంతో పాటూ ఈ మూవీపై తను ఎన్నో ఆశలు పెట్టుకున్నాడు.

# శ్రీదేవిలా నటించాలనుంది!



అతిలోక సుందరి శ్రీదేవికి ఉన్న ఫ్యాన్ ఫాలోయింగ్ అంతా ఇంతా కాదు. ఎంతో మంది సెలబ్రిటీలు సైతం ఆమెను అభిమానిస్తుంటారు. రీసెంట్ గా ఓ ఫ్యాషన్ టూర్ లో పాల్గొన్న తమన్నా భాటియాకు ఓ ప్రశ్న ఎదురైంది. ఆన్ స్క్రీన్ పై ఎలాంటి తరహా పాత్రలు పోషించాలనుంది అని అడిగినప్పుడు తమన్నా క్షణం ఆలోచించకుండా వెంటనే శ్రీదేవి పేరు చెప్పింది. శ్రీదేవి 2018లో దురదృష్టవశాత్తూ బాత్ టబ్ లో పడి నీటిలో మునిగి చనిపోయిన విషయం తెలిసిందే. శ్రీదేవిపై తమన్నా తన అభిమానాన్ని ఈ ఈవెంట్ లో వెల్లడించింది. శ్రీదేవి సూపర్ ఐకానిక్ అని, ఆన్ స్క్రీన్ శ్రీదేవిగా నటించాలని కోరుకుంటున్నట్టు తమన్నా తెలిపింది. శ్రీదేవి మేడమ్ ను ఆరాధించే వ్యక్తుల్లో తాను కూడా ఒకరని తమన్నా ఈ సందర్భంగా చెప్పుకొచ్చింది. స్టీరియోటైప్ పాత్రల నుంచి కామెడీ, డ్రామా వరకు ఎన్నో జానర్లలో పలు విభిన్న పాత్రలను పోషించి ఇండియన్ సినీ హిస్టరీలోనే మొదటి మహిళా సూపర్ స్టార్ గా శ్రీదేవి గుర్తింపు పొందారని తమన్నా చెప్పింది. తెలుగు, తమిళ, హిందీ, కన్నడ, మలయాళ భాషల్లో శ్రీదేవి 50 సంవత్సరాలకు పైగా వివిధ రంగాల్లో కొనసాగారని, మిస్టర్ ఇండియా, సద్మా, హిమ్మత్ వాలా, ఖుదా గవా, లాడ్లా, ఇంగ్లీష్ వింగ్లీష్, మామ్ లాంటి గుర్తుండిపోయే సినిమాల్లో శ్రీదేవి నటించారని తమన్నా తెలిపింది. ఇక తమన్నా విషయానికొస్తే అమ్మడు ఆఖరిగా నీరజ్ పాండే దర్శకత్వంలో వచ్చిన సికిందర్ కా ముఖద్దర్ సినిమాలో నటించింది. ఈ సినిమాలో జిమ్మీ షీర్ గిల్, అవినాష్ తివారీ, రాజీవ్ మెహతా మరియు దివ్య దత్తా కీలక పాత్రల్లో నటించారు. ప్రస్తుతం తమన్నా తెలుగులో చేస్తున్న ఓదెల2 త్వరలోనే ప్రేక్షకుల ముందుకు రానుంది. అశోక్ తేజ దర్శకత్వంలో వస్తున్న ఓదెల2ను సంపత్ నంది కథ అందిస్తూ నిర్మిస్తున్నారు. ఈ సినిమాలో తమన్నా నాగ సాధువుగా కనిపించనుంది. ఓదెల2 పై తమన్నా చాలానే ఆశలు పెట్టుకుంది. దానికి తగ్గట్టే రీసెంట్ గా రిలీజైన ఓదెల2 టీజర్ కూడా సినిమాపై అంచనాల్ని పెంచింది.

# బెట్టింగ్ యాప్స్‌కు దూరంగా ఉండాలి


## నటుడు సంపూర్ణేష్‌బాబు




బెట్టింగ్‌లపై ప్రముఖ సినీ నటుడు సంపూర్ణేష్‌బాబు కీలక వ్యాఖ్యలు చేశాడు. బెట్టింగ్ యాప్స్‌కు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిస్తూ ఓ వీడియోను విడుదల చేశాడు.. అందులో ఆయన మాట్లాడుతూ.. యువత బెట్టింగ్ యాప్‌లకు బానిసలై జీవితాలను నాశనం చేసుకుంటున్నారని ఆవేదన వ్యక్తం చేశాడు. బెట్టింగ్‌ల వల్ల బాగుపడినట్టు చరిత్రలోనే లేదన్నాడు. ఇలాంటి వాటికి బానిసలయ్యే ముందు ఇంట్లో వారి గురించి ఆలోచించాలని కోరాడు. బెట్టింగ్ యాప్‌ను ప్రమోట్ చేస్తున్న వారిపై ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరాడు. బెట్టింగ్ యాప్‌లపై ఇటీవల తెలుగు రాష్ట్రాల్లో విపరీత చర్చ జరుగుతోంది. బెట్టింగ్ యాప్‌ల ద్వారా లక్షల రూపాయలు సంపాదించవచ్చన్న సోషల్ మీడియా ప్రమోషన్లతో ఎంతోమంది వాటి బారినపడి లక్షల రూపాయలు నష్టపోతున్నారు. ఈ క్రమంలో కొందరు తట్టుకోలేక ఆత్మహత్యలు కూడా చేసుకున్నారు. దీంతో ఈ బెట్టింగ్ యాప్‌లపై ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ పోరు ప్రారంభించారు. వాటికి దూరంగా ఉండాలని యువతకు పిలుపునిస్తూ ప్రచారం చేస్తున్నారు. ఈ ప్రచారానికి స్పందించిన సంపూర్ణేష్‌బాబు తనవంతుగా ఈ వీడియోను విడుదల చేసి బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలని ప్రజలకు పిలుపునిచ్చాడు.

# మరోసారి శర్వాతో అనుపమ

తెలుగులో మంచి ఫ్యాన్ ఫాలోయింగ్ సంపాదించుకున్న హీరోయిన్లలో మలయాళ బ్యూటీ అనుపమ పరమేశ్వరన్ కూడా ఒకరు. అ..ఆ సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అనుపమ తర్వాత పలు సినిమాల్లో నటించి మెప్పించింది. శతమానం భవతి సినిమాతో పక్కింటి అమ్మాయి పేరును సంపాదించుకుంది అనుపమ. శర్వానంద్ హీరోగా సతీష్ వేగేశ్న దర్శకత్వంలో తెరకెక్కిన ఈ సినిమాలో శర్వానంద్, అనుపమ మధ్య వచ్చిన సీన్స్ ప్రేక్షకుల హృదయాల్ని కట్టిపడేశాయి. శతమానం భవతిలో శర్వా- అనుపమ కెమిస్ట్రీ చాలా బాగా వర్కవుటైంది. 2017లో వచ్చిన ఆ సినిమా తర్వాత అనుపమ పలు సినిమాల్లో నటించింది కానీ శర్వానంద్ తో మళ్లీ కలిసి సినిమా చేయలేదు. వీరిద్దరి జంట ఆన్ స్క్రీన్ పై చూసిన వారంతా ఎప్పుడెప్పుడు వీరిద్దరూ కలిసి నటిస్తారా అనుకున్నారు. ఈ నేపథ్యంలోనే మళ్లీ ఈ జంట ఇన్నేళ్లకు కలిసి నటించబోతున్నట్టు తెలుస్తోంది. శర్వానంద్ హీరోగా సంపత్ నంది దర్శకత్వంలో ఓ సినిమా తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఏప్రిల్ నుంచి ఈ సినిమా సెట్స్ పైకి వెళ్లనుంది. అయితే ఈ సినిమాలో హీరోయిన్ గా అనుపమ పరమేశ్వరన్ ను ఎంపిక చేశారని సమాచారం. రీసెంట్ గానే చిత్ర బృందం ఈ విషయమై అనుపమని కలిసినట్టు తెలుస్తోంది. అనుపమ కూడా ఈ సినిమా చేయడానికి సుముఖంగానే ఉందని టాక్ వినిపిస్తోంది. త్వరలోనే ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వచ్చే వీలుంది. రీసెంట్ గా అనుపమ నటించిన రిటర్న్ ఆఫ్ ది డ్రాగన్ సూపర్ హిట్ అయిన విషయం తెలిసిందే. ఈ సినిమాలో అనుపమ చిన్న పాత్రలోనే కనిపించినప్పటికీ తన నటనతో అందరినీ ఆకట్టుకుంది. దీంతో టాలీవుడ్ ఫోకస్ మొత్తం మళ్లీ అనుపమ వైపు మళ్లింది. ప్రస్తుతం నారీ నారీ నడుమ మురారీ సినిమాతో పాటూ అభిలాష్ దర్శకత్వంలో ఓ సినిమా చేస్తున్న శర్వా, త్వరలోనే సంపత్ సినిమాను మొదలుపెట్టనున్నాడు.





# ఇకపై పవర్ఫుల్ విలన్ రోల్స్ చేస్తా : శివాజీ



'కోర్ట్' .. ఇప్పుడు అందరూ ఈ సినిమాను గురించే మాట్లాడుకుంటున్నారు. పోయిన శుక్రవారం విడుదలైన ఈ సినిమా, నాని బ్యానర్ కి పెద్ద హిట్ తెచ్చిపెట్టింది. ఈ సినిమాలో విలన్ రోల్ చేసిన శివాజీకి మంచి మార్కులు పడ్డాయి. తాజాగా ఓ యూ ట్యూబ్ ఛానల్ కి ఇచ్చిన ఇంటర్వ్యూలో శివాజీ ఈ సినిమాను గురించి మాట్లాడారు. "గతంలో హీరోగా చాలా సినిమాలు చేశాను .. ఎంతో అంకితభావంతో కష్టపడ్డాను. అయినా నేను ఆశించిన స్టార్ డమ్ రాలేదు" అని అన్నారు. " ఎంతగా కష్టపడుతున్నా స్టార్ డమ్ రాకపోవడంతో, నాలో బాధ .. కసి పెరుగుతూ వెళ్లాయి. నాలో అదే పనిగా అంతర్మథనం జరుగుతూ వచ్చింది. అలాంటి పరిస్థితులలో నా దగ్గరికి 'మంగపతి' పాత్ర వచ్చింది. కథ వినగానే నన్ను మంగపతి పూనేశాడు. ఇంత కాలంగా మనం ఎదురుచూస్తున్నది ఇలాంటి రోల్ కోసమే కదా అనిపించింది. అందుకే ఎంతమాత్రం ఆలోచన చేయకుండా ఓకే చెప్పేశాను" అని అన్నారు. "చిన్నప్పటి నుంచి కూడా నేను ఎస్వీ రంగారావు .. రావుగోపాలరావు .. నాగభూషణం .. నూతన్ ప్రసాద్ వంటి వారి విలనిజాన్ని ఎంజాయ్ చేస్తూ వచ్చాను. డైలాగ్స్ తోనే వాళ్లంతా గొప్ప విలనిజాన్ని పండించారు. అలాంటి ఒక పాత్ర చేయాలనుకున్న నాకు ఈ సినిమాతో ఆ ముచ్చట తీరింది. హీరోగా నేను అనుకున్న స్టార్ డమ్ ను విలన్ రోల్ తెచ్చిపెట్టడం విశేషం. ఇకపై పవర్ ఫుల్ విలన్ రోల్స్ వస్తాయని ఆశిస్తున్నాను" అని అన్నారు.